అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- జూన్ మొదటి వారానికి బైపాస్-కేబుల్ బ్రిడ్జ్ మధ్య రిటైనింగ్ వాల్ పూర్తి
- మొక్కజొన్న 2.17 లక్షల టన్నులు, వరి 2,37,500 టన్నుల కొనుగోళ్లు

2 లో

మనం ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com గురువారం | 23 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 18

కదలని బస్సు

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): ఆర్‌టిసి కార్మికుల సమ్మె బుధవారం ప్రారంభమైంది. ఆర్టిసి సమ్మెను పురస్కరించుకుని కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఖమ్మం డిపో వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. సిపిఐ, ఏఐటియుసి, ప్రజా సంఘాల కార్యకర్తలు సమ్మెకు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఆర్టిసి కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. 2019లో 52 రోజులు సమ్మె జరిగినప్పుడు సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని అప్పుడు ఏ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేశారో ఇప్పుడు అదే సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తునప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను మేము అధికారంలోకి రాగానే చేపడతామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందని ప్రశ్నించారు. ఆర్టిసి కార్మికులది గొంతెమ్మ కోర్కెలు కావన్నారు. పిఆర్సి అమలు కోసం 50 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినా ఈ ప్రభుత్వం కనీసం స్పందించ లేదన్నారు. ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం జరిగేంత వరకు సమ్మె కొనసాగు తుందన్నారు. ప్రభుత్వంలో విలీనం, పిఆర్సి అమలు, వేతన సవరణ తదితర అంశాలను పరిష్కరించాలని హేమంతరావు కోరారు.

ఆర్‌టిసి సమ్మె ప్రారంభం

- డిపో ఎదుట కార్మికుల ఆందోళన
- సమ్మెకు రాజకీయ పార్టీల, పలు ప్రజా సంఘాల సంపూర్ణ మద్దతు

రైతు పక్షపాతి మన ప్రభుత్వం

2 లో

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖా మంత్రి పొంగులేటి

- సన్న వడ్లకు క్వింటాల్కు రూ. 500 బోనస్
- ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు వేగవంతం

2 లో

వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి
అధికారులు అలసత్వం వీడి పనులు ముమ్మరం చేయాలి
గోదావరి జలాలతో ఉభయ జిల్లాలు సస్యశ్యామలం
సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు వేగవంతం

సత్తుపల్లి, ఏప్రిల్ 22(మనం న్యూస్): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంటలో అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం కలెక్టర్లు అంకిత్, అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యాతాలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల అమలులో ఉన్న లోపాలు, సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేసి, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని వీడి పనులను వేగవంతంగా చేయాలన్నారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. యాతాలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్నచిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. యాతాలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ కాలువ స్టెబిలైజేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్ జలాలు అందకపోయినా వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా వేంసూరు, దమ్మపేట మండలాలకు కూడా నీరు అందించే అవకాశముందని అన్నారు. నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే సంవత్సరం అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు గోదావరి జలాలు అందించవచ్చని తెలిపారు. దీంతో మొత్తం 110 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ పూర్తవుతుందని, మెయిన్ కాలువతో పాటు మూడు పంప్ హౌస్లను వినియోగించి గోదావరి జలాలను ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలకు సరఫరా చేసే అవకాశం కలుగుతుందన్నారు. పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు అందించడమే కాకుండా మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ను పూర్తి చేసి పినపాక నియోజకవర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్టును నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,ఉభయ జిల్లాల ఇంజనీరింగ్ ఇరిగేషన్ పోలీస్ ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి మన ప్రభుత్వం

నేలకొండపల్లి, ఏప్రిల్ 22(మనం న్యూస్): రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం నేలకొండపల్లిలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు వరి వేస్తే ఉరి అన్న పాలకులకు భిన్నంగా, నేడు సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామన్నారు.

– మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్

ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నెరవేరుస్తోందని పొంగులేటి స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని, తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్లు విడుదల చేసి 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసిందని గుర్తు చేశారు. గతంలో రైతు బంధు కింద రూ. 10 వేలు అందిస్తే, రైతు భరోసా ద్వారా రూ. 12 వేలు అందిస్తున్నామన్నారు.

– విస్తృతంగా గోదాముల నిర్మాణం

రైతులు పండించిన పంటను భద్రపరుచుకునేందుకు వీలుగా రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం మేర పెంచేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కోల్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలి

– రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
– జూన్ మొదటి వారానికి బైపాస్–కేబుల్ బ్రిడ్జ్ మధ్య రిటైనింగ్ వాల్ పూర్తి
– మొక్కజొన్న 2.17 లక్షల టన్నులు, వరి 2,37,500 టన్నుల కొనుగోళ్లు

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. పౌర సరఫరాలు, మార్కెటింగ్, మార్క్ఫెడ్, పంటల కొనుగోలు, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రగతి, ఖమ్మం నగర కార్పొరేషన్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటల కొనుగోళ్లు, నగర అభివృద్ధి పనులను ఎటువంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ మొదటి వారానికి బైపాస్ నుంచి కేబుల్ బ్రిడ్జ్ వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తవ్వాలని, చిన్న గ్యాప్ కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, క్రీడాకారుల వసతి గృహాలు, అతిథి గృహం, కన్వెన్షన్ హాల్ వంటి సదుపాయాలతో 20 ఎకరాల్లో 92 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కనీసం 50 శాతం కేంద్ర నిధులు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని, 200 మంది క్రీడాకారులకు వసతి కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అత్యున్నత నాణ్యతతో నిర్మించబడిందని, దానికి సరైన నిర్వహణ, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి త్వరలోనే క్రీడా కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు నిర్వహించి ఘనంగా ప్రారంభోత్సవం చేయాలని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో రోడ్ డివైడర్ అధిక స్థలం ఆక్రమిస్తోందని, భవిష్యత్తులో మార్పులు చేయాలని, ఆకర్షణీయమైన మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ధంసలాపురం ఎస్టీపీ స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్లైన్ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం ఖిల్లాకు రోప్వే నిర్మాణం వర్షాల వల్ల ఆగకుండా అవసరమైన పనులు వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని, ఈ నెలలో బేస్మెంట్ పనులు పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ అభివృద్ధి పనులు, పంటల కొనుగోళ్లు సమాంతరంగా జరగాలని, మార్కెట్ కాంపౌండ్ వాల్, మిగిలిన షెడ్లు ఈ నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సోలార్ పవర్ వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, విక్రయం అంశాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. వరదల సమయంలో మార్కెట్లో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంటల కొనుగోళ్లపై మంత్రి మాట్లాడుతూ ఏ కేంద్రంలోనూ గన్నీ బ్యాగుల కొరత రాకూడదని, అవసరమైన చోట అదనపు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, పీఏసీఎస్లలో డిమాండ్ మేరకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిల్వ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, 4 లక్షల 34 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండగా 2.17 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 39 వేల టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో 72 వేల టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని తెలిపారు. 2,37,500 మెట్రిక్ టన్నుల వరి కొనుగోళ్లకు 308 కేంద్రాలు ప్రతిపాదించగా, 240 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. 45 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. టీయూఎఫ్ఐడీసీ కింద 66 పనులు మంజూరు కాగా 63 పూర్తయ్యాయని, మిగిలిన 3 పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. సింథటిక్ ట్రాక్‌ను 5 లేయర్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించామని చెప్పారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో రోడ్డు, డివైడర్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ధంసలాపురం ఎస్టీపీ స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ అభివృద్ధి పనులు జూలై చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మే నెలలో వేగంగా పనులు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పమ్మి రవికి దళిత రత్న అవార్డు

అభినందించిన బార్ అసోసియేషన్

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): న్యాయవాది, జానపద యుద్ధనౌక పమ్మి రవి దళిత రత్న అవార్డు అందుకున్నారు. సమాజ కళా రంగా సేవకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్యులు అడ్లూరీ లక్ష్మణ్ హైదరాబాద్ రవీంద్రభారతిలో అంబేద్కర్ జయంతి రోజు దళితరత్న అవార్డులను ప్రకటించారు. దళితరత్న అవార్డు పొందిన గాయకుడు పమ్మి రవిని తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ మందడం శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎడ్లపల్లి రమేష్ , ఖమ్మం బార్ అసోసియేషన్ కమిటీ, పలువురు న్యాయవాదులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పరిశుభ్రమైన నగరంగా నిలిచేలా చర్యలు...

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

విస్తృత రోడ్లు, 24 గంటల తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): విస్తృత రోడ్లు, 24 గంటల తాగునీరు, విద్యుత్ తో, శాంతియుత వాతావరణంతో పరిశుభ్రమైన నగరంగా ఆదర్శంగా ఖమ్మం నిలిచేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.బుధవారం ఖమ్మం నగర కార్పొరేషన్ ఆర్టీఓ కార్యాలయం వద్ద కోటి 46 లక్షల రూపాయల వ్యయంతో ఆర్టీఓ ఆఫీస్ నుంచి బైపాస్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు, విజయనగర కాలనీలో 50.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని విస్తృత రహదారులు, 24 గంటల తాగునీటి సరఫరా, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. శాంతియుత వాతావరణంతో పాటు పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలు ఖమ్మాన్ని ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తానని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి దేవుడు తగిన శక్తి ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.పేదలు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ అవసరమైన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ఖమ్మంకు రింగ్ రోడ్ ఏర్పాటు కానుందని, ట్రాఫిక్ సమస్యలు త్వరలో పరిష్కార మవుతాయని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి డివిజన్లో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టి ఖమ్మంను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ తుమ్మల అంటేనే అభివృద్ధి అని, ఖమ్మం నగరాన్ని నాలుగు వైపులా సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా మంత్రి కృషి

చేస్తున్నారని తెలిపారు.రాజకీయాలకు అతీతంగా ప్రతి డివిజన్కు నిధులు కేటాయిస్తూ సమాన అభివృద్ధిని సాధిస్తున్నామని చెప్పారు.నగరంలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మంత్రి ఎవరినీ నొప్పించకుండా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యూజీడీ పనులు జరుగుతున్నాయని, వెలుగు మట్ల ప్రాంతంలో ప్రజలకు మెరుగైన పర్యావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. రాబోయే మూడు సంవత్సరాల్లో ఖమ్మం నగరం ఆదర్శ నగరంగా మారుతుందని, మంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నేడు రూ.50.85 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మంత్రి మార్గదర్శకత్వంలో నగర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అన్ని డివిజన్లలో రోడ్డు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

26న రఘు శేషభట్టర్ సాహితీ సమాలోచనం

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్):

సుప్రసిద్ధ కవి రఘు శేషభట్టర్ సాహితీ సమాలోచనం ఈ నెల 26 వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు మమతా మెడికల్ కాలేజి దగ్గరున్న సివిఆర్ మినీ ఫంక్షన్ హాల్ లో జరగనుంది. ప్రజ్ఞా భారతి సహకారంతో జరిగే ఈ సభను సంచిక సాహిత్య పత్రిక నిర్వహిస్తోంది. పొత్తూరి సీతారామారావు స్వాగత వచనాలు పలికే ఈ కార్యక్రమానికి సంచిక సహ సంపాదకుల ఎసోమశంకర్ అధ్యక్షత వహిస్తారు. తోట సుభాషిణితో పాటు ప్రముఖ కవులు సిద్ధార్థ, దిలావర్, తుమ్మూరి రామ్మోహన్ రావు మాట్లాడతారు. అనంతరం కవి స్పందన ఉంటుంది. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

నగరంలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చర్చికాంపౌడ్ ఓవర్ బ్రిడ్జ్ మరమ్మత్తులకు చర్యలు చేపట్టండి

ప్రకాష్ నగర్, చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం ఏప్రిల్ 22(మనం న్యూస్): ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.బుధవారం నగరంలోని చర్చికాంపౌండ్, ప్రకాష్ నగర్ ఓవర్ బ్రిడ్జ్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జ ప్రస్తుత పరిస్థితి, మరమ్మత్తుల అవసరం, ట్రాఫిక్ సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జ్పై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్రిడ్జ్ మధ్యభాగంలో రబ్బరు స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల ప్రయాణాన్ని సాఫీగా మార్చాలని సూచించారు. అలాగే, బ్రిడ్జ్పై ఉన్న గుంతలు, పగుళ్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, బ్రిడ్జ్ మీద ఉన్న పూల

కుండలలో మొక్కలు సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, ప్రమాదాల సూచనలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.నగర అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న అన్ని పనులు నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను దశలవారీగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మనం

ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాథపాలెం

నేడు శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): నేడు (ఏప్రిల్ 23న) ఉదయం 10-00 గంటలకు కలెక్టరేట్ లోని రెండవ అంతస్తు రూమ్ నెంబర్ 30 లో ఉన్న జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జయంతి వేడుకలలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, వివిధ కులస్థులు, కుల సంఘ నాయకులు, ప్రతినిధులు, అధికారులు, అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

అంతర్జాతీయ ఎర్త్‌డేని సందర్భంగా న్యూఇరా విద్యార్థుల వినూత్న ప్రదర్శన

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): స్థానిక న్యూఇరా పాఠశాలలో అంతర్జాతీయ ఎర్త్ డే ని పురస్కరించుకొని విద్యార్థులు సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా పర్యావరణ

పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు 'భూమిని కాపాడుదాం', ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిదాం'. 'పచ్చదనం పెంచుదాం వంటి నినాదాలతో ప్రజలల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు, డైరక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు మట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు చిన్నవయసు నుంచే ప్రకృతి పట్ల ఆరాధన, బాధ్యతను అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని ప్రతి విద్యార్థి ఒక 'గ్రీన్ అంబాసిడర్ గా మారి సామాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.జి.సి. జిల్లా కోఆర్డినేటర్ ఇ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమిని సంరక్షించటం మన అందరి బాధ్యత అని, చిన్న చిన్న చర్యలే పెద్దపెద్ద మార్పులకు కారణం అవుతాయని అన్నారు.

శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సంస్కార కేంద్రాల విద్యార్థుల సమ్మేళనం

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): బుధవారం సాయంత్రం శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సంస్కార కేంద్రాల విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం అంతటా నడుస్తున్న 17 సంస్కార కేంద్రాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం దేవకి వాసుదేవరావు, విభాగ్

అధ్యక్షులు మార్గదర్శకత్వంలో జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్లోకాలు, పద్యాలు, నాటికలు, నీతి కథలు, పాటలు, నృత్యాలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలు సంస్కార కేంద్రాలలో అందిస్తున్న సాంస్కృతిక, నైతిక విలువలను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అకాడెమిక్ ఇన్చార్జ్ నల్లంచక్రవర్తుల కృష్ణమాచార్యులు, రాష్ట్ర సేవా ప్రముఖ్ జి ఎల్ ఎన్ శాస్త్రి రాష్ట్ర సేవా సమ్యోజక్ గౌరిధర గంగాధర్ రెడ్డి , విభాగ కార్యదర్శి కరవది వెంకట శ్రీనివాసరావు, పాఠశాల కార్యదర్శి గన్నవరపు చంద్రశేఖర్, పాఠశాల ప్రభారి కార్లపాటి సురేష్, విధ్వత్ సమితి సభ్యులు యచ్చ రామకృష్ణరావు, ప్రధానాచార్యులు సంతోష గౌతమ్ పాల్గొన్నారు. అధ్యాపకులు , సంస్కార కేంద్రాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .

మనం

పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటాద్రికి నివాళులు అర్పించిన మాజీ వైస్ ఎంపీపీ

తిరుమలాయపాలెం ఏప్రిల్ 22 (మనం న్యూస్) మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇటీవల మరణించిన కాకరవాయి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోరపాక వెంకటాద్రి అకాల మరణాన్ని చింతిస్తూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వైస్ ఎంపీపీ బుద్దా వంశీ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కట్కూరి శ్రీనివాసరెడ్డి, పాక్స్ మాజీ డైరెక్టర్ గుండాల లింగయ్య, మంగలి బండ తండా గ్రామ సర్పంచ్ మురళి కోటేష్, దోనెపల్లి వినోద్, గుండెబోయిన శ్రీశైలం, కొత్తపెల్లి రవి, కొత్తపెల్లి చిన్న మల్లయ్య, కొత్తపెల్లి కృష్ణ, నల్ల గట్టు కిరణ్, సతీష్, గంగరాజు, గంట్ల రవీందర్ రెడ్డి తదితరులు హాజరై వేంకటాద్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారులు మోరపాక నాగయ్య, మోరపాక సుధాకర్ కుటుంబాలకు గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెల్పనైనది.

న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సైకిల్ ర్యాలీ

వైరా, ఏప్రిల్ 22 (మనం న్యూస్): అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని 99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత పాల్గొని సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు భూమిని కాపాడుకుందాం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం పచ్చదనం పెంచుదాం వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డా పి భుమేష్ రావు మాట్లాడుతూ, అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. భూమిని సంరక్షించడం మనందరి బాధ్యత అని, చిన్నచిన్న చర్యల ద్వారా కూడా పర్యావరణాన్ని కాపాడవచ్చని , "ప్రకృతిని మనం కాపాడితే.. అదే మనల్ని కాపాడుతుంది అనే నినాదంతో తరువాతి తరాల కోసం పచ్చని, స్వచ్ఛమైన భూమిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మరియు గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమౌతుందని భూమిపై ఉన్న అన్ని వనరులు సక్రమంగా ఉంటేనే మానవ మనుగడ అభివృద్ధికి ఎటువంటి అవాంతరాలు ఉండవని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, భువనప్రసాద్, ఎఓ నరసింహ రావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్లేడును మండల కేంద్రంగా ప్రకటించాలి

నియోజకవర్గ స్పెషలాఫీసర్‌కు వినతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): మండల పరిధిలోని సుబ్లేడు గ్రామ పంచాయతీని నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు మందడి ఇజ్రాయిల్ పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు సుబ్లేడు గ్రామానికి ఇరువైపులా అనేక గ్రామాలు వ్యాపార, వైద్య, రెవెన్యూ అవసరాల కోసం ఆధారపడుతున్నాయని గ్రామానికి అవసరమైన వనరులు సమృద్ధిగా ఉన్నాయని వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు సుబ్లేడు గ్రామం గతంలో మేజర్ గ్రామపంచాయతీగా రెవెన్యూ పరంగా కీలక కేంద్రంగా కొనసాగిందని తాలూకాల కాలంలో మహబూబాబాద్ నుండి నల్గొండ జిల్లాను ఆనుకుని వాణిజ్య కార్యకలాపాలు సాగాయని తెలిపారు వ్యాపార పరంగా ఇతర రాష్ట్రాలకు ధాన్యాన్ని రవాణా చేసిన చరిత్ర సుబ్లేడు గ్రామానికి ఉందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు అక్షర యోధుడు, ఉద్యమ జర్నలిస్ట్ సోయాబుల్లాఖాన్ ఈ గ్రామంలో జన్మించడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని మేధావులు తెలిపారు ఆయన హైదరాబాద్ నగరంలో ఇమ్రోజ్ పత్రికను స్థాపించి రజాకారుల ఆగడాలను ఎదిరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారని వివరించారు మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని శంకుస్థాపన చేసి నిర్మించారని ఆ ఆసుపత్రి ద్వారా గతంలో పరిసర గ్రామాలకు వైద్య సేవలు అందాయని తెలిపారు అయోధ్య రామ మందిరం నిర్మాణ కాలంలో గ్రామంలో నిర్మించిన పోలీస్ స్టేషన్ ద్వారా పరిసర గ్రామాలకు చట్టపరమైన సేవలు అందించారని పేర్కొన్నారు గ్రామంలో వీఆర్వో నివాసం నిర్మాణం కూడా జరిగినట్టు తెలిపారు సుబ్లేడు గ్రామం నుండి విద్యాభ్యాసం చేసి ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవులు అధిరోహించినవారు ఉన్నారని గ్రామ పెద్దలు తెలిపారు గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ హై స్కూల్, ప్రాథమిక పాఠశాల, ఎస్సీ ఎస్టీ హాస్టల్, ప్రభుత్వ ఆసుపత్రి, పశువుల ఆసుపత్రి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, పోస్టాఫీస్, పోలీస్ స్టేషన్, సినిమా హాల్, సహకార బ్యాంకు, ఆర్ఐ క్వార్టర్స్, ఆయుర్వేద ఆసుపత్రి వంటి అన్ని వసతులు ఉన్నాయని వివరించారు 13వ శతాబ్దం కాకతీయుల కాలం నుండి నిజాం నవాబుల కాలం వరకు ఈ గ్రామం రెవెన్యూ పరంగా ప్రాధాన్యం కలిగినదని ఫిర్కాగా కొనసాగిందని పేర్కొన్నారు సర్వే నంబర్ 149లో సుమారు 65 ఎకరాల భూమి ఉన్నట్టు గ్రామస్తులు సూచించారు సుబ్లేడు గ్రామం రఘునాథపాలెం, మంగలి బండ తండా, సుద్దవాగు తండా, కాకరవాయి, సోలిపురం, పైనంపల్లి, రాజారం, జూపెడ, బచ్చోడు తండా, లక్ష్మీదేవిపల్లి తండా, బీరోలు, ఏలువారిగూడెం, మేడిదపల్లి, మేకల తండా, మహందాపురం, ఇస్లావత్ తండా, హస్నాబాద్ వంటి గ్రామాలకు సెంటర్ పాయింట్‌గా ఉండి అన్ని సేవలు అందించగల సామర్థ్యం ఉందని తెలిపారు తాలూకాల కాలంలో రెవెన్యూ ఫిర్కాగా సిస్తులు చెల్లించారని తెలిపారు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూడా వినతిపత్రం సమర్పిస్తూ సుబ్లేడు గ్రామాన్ని తక్షణమే మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు

వేసవి వేళ రామ 'సహాయం'

44 గ్రామాల్లో తాగునీటి కష్టాలకు ఎంపీ రఘురాం రెడ్డి చెక్

రూ.35 లక్షల నిధులతో ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు

వారం రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు

తిరుమలాయపాలెం ఏప్రిల్ 22 (మనం న్యూస్) వేసవిలో భానుడు భగ భగ లాడుతుండటంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల (వీఖూఖూణూ) నుంచి రూ.35 లక్షలు మంజూరు చేస్తూ తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ?దప్పిక తీర్చే 'ఎంపీ లాడ్స్': జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాలోని 44 గ్రామాల్లో రూ.35,20,000 నిధులతో కొత్తగా చేతిపంపులను ఏర్పాటు చేయించనున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా.. ఇప్పటికే కొన్ని ప్రారంభమయ్యాయి. దీనివల్ల వృద్ధులు, మహిళలకు దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకునే కష్టాలు తప్పనున్నాయి. వారం రోజుల్లోనే పనులు పూర్తి కావాలి.. నిధుల అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను పట్టాలెక్కించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.? తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే నిధులు కేటాయించినందుకు స్థానిక సర్పంచ్ లు, ప్రజలు ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ గృహనిర్మాణంపై వివాదం అసత్యం

యజమాని గాదరి వెంకన్న

తిరుమలాయపాలెం ఏప్రిల్ 22 (మనం న్యూస్) తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై వస్తున్న వివాద వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఇంటి యజమాని గాదరి వెంకన్న స్పష్టం చేశారు, తాత గాదరి బిక్షమయ్య సంపాదించిన ఆర్ అండ్ బి రోడ్డుకు తూర్పు 200 గజాలు, పడమర 200 గజాల స్థలాన్ని నలుగురు అన్నదమ్ములకు గ్రామ పెద్దల సమక్షంలో వయసు క్రమాన్ని పరిగణలోకి తీసుకుని సమానంగా పంచుకున్నామని తెలిపారు, పంపకాల సమయంలో గాదరి మల్లయ్యకు సమాచారం ఇచ్చినా హాజరు కాలేదని పేర్కొన్నారు, తల్లిదండ్రుల సంరక్షణ, చివరి కార్యక్రమాలు కూడా అన్నదమ్ములంతా సమానంగా నిర్వహించామని చెప్పారు, తరువాత కాగితాలు తయారు చేసుకుని ఒక్కొక్కరికి 50 గజాల చొప్పున భాగాలు వచ్చినట్లు వివరించారు, తనకు వచ్చిన భాగంతో పాటు పెదనాన్న మరియు బాబాయి భాగాలను కొనుగోలు చేసి మొత్తం 100 గజాల స్థలంలో ఇల్లు నిర్మాణం చేపట్టామని తెలిపారు, ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయిన తర్వాత పునాదులు వేస్తున్న సమయంలో అడ్డంకులు సృష్టించడంతో పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని, మూడు నెలలు పనులు నిలిపివేసినా ప్రత్యర్థి పరిష్కారం కోసం ముందుకు రాలేదని అన్నారు, పలుమార్లు పోలీస్ స్టేషన్ మరియు ఎంపీడీవో కార్యాలయంలో వివరణ ఇచ్చినా కూడా తప్పుడు ప్రచారం కొనసాగుతుందని విమర్శించారు, తనకు కేటాయించిన స్థలంలోనే నిర్మాణం జరుగుతుందని, ఎలాంటి అక్రమం లేదా భూ వివాదం లేదని స్పష్టం చేస్తూ ప్రజలు వాస్తవాలను గమనించాలని వెంకన్న కోరారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరు, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : రైతులు పామాయిల్ సాగుచేసుకొని అధిక లాభాలు పొందవచ్చని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నాయక్ అన్నారు. ఏన్కూరులోని మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు పామాయిల్ తోటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ సాగుకు అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. రైతులు పామాయిల్లో ఇతర అంతర పంటలు వేసుకోని లాభాలు చేకూర్చుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రోత్సాహంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులు పామాయిల్ సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్, జిల్లా కమిటీ కార్యదర్శి సామేలు, రేపల్లెవాడ సర్పంచ్ అజ్మీర

సురేష్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, మాలోత్ నరసింహారావు, గొల్ల చిన్నస్వామి, వీరు నాయక్,మాదినేని అశోక్, నిమ్మల నరేందర్, వక్కంతుల సాగర్, పంతగాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరులో విద్యా వార్షిక సమీక్ష సమావేశం

ఏన్కూరు, ఏప్రిల్ 22(మనం న్యూస్): ప్రైవేట్ స్కూల్లో ఒక దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక కమ్మవారి కల్యాణ మండపంలో మండల విద్యాశాఖ అధికారి పి.నాగిరెడ్డి ఆధ్వర్యంలో విద్యా వార్షిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు ఈసీఆర్ అంశంపై ప్రత్యేక నాటక ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతమిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ బలోపేతానికే సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్ద అంటిపెట్టుకున్నారన్నారు. ఈ మేరకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, గురుకులాలను మెరుగైన వసతులతో నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఇంగ్లీష్ మీడియం లో విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాలని, అందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ బడిబాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల పై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలలకే తమ

పిల్లలను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ తుమ్మలపల్లి కృష్ణ, విద్యాశాఖ ఏఓ ప్రభాకర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోతు లచ్చిరాం నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణ ప్రసాద్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రభావతి రెడ్డి, మండల నాయకులు మేడ ధర్మారావు, ముక్తి వెంకటేశ్వర్లు, గాలీబు, వీరన్న, నరసింహారావు, శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కొనుగోళ్ళు లేక మొక్కజొన్న కల్లాలోనే రైతుల పడికాపులు

హమాలీ ఖర్చులు సైతం ప్రభుత్వమే భరించాలి : సీపీఐ(ఎం)

కారేపల్లి, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : రైతుల ప్రయోజనం కోసం అదనపు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కే.నరేంద్ర అన్నారు. బుధవారం కారేపల్లి మండల పరిధిలోని మాదారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ(ఎం),రైతు సంఘం నాయకులు సందర్శించి రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ె రైతులు హమాలీలకు చెల్లిస్తున్న రేట్లు, కాంటాలు,లారీల కొరతపై ఆరా తీశారు.ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కారేపల్లి మండలంలో ఎనిమిది వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినా మండలం మొత్తంలో కేవలం మాదారం గ్రామంలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. మండల పరిధిలోని చివరి గ్రామాలైన రేలకాయలపల్లి, చీమలపాడు, తొడితలగూడెం, పోలంపల్లి, కమలాపురం రైతులు మాదారం కేంద్రాన్ని వచ్చి మొక్కజొన్న అమ్మకాలు సాగించటం అవస్థలతో కూడుకున్నదన్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారస్తులకే అరకొరగా అమ్ముకుంటూ ఆర్థికంగా, నష్టపోతున్నారన్నారు.పంట దిగుబడి 50 క్వింటాళ్లు ఉండగా కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. లారీ మాముళ్ల పేరుతో బస్తాకు రూ.5 ఇవ్వాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారన్నారు. లారీ దిగుమతికి వారం రోజులు పడుతుందని వెయిటింగ్ ఖర్చులు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. గోదాంల వద్ద కూడా వసూళ్ల పర్వం సాగిస్తున్నారనిరైతులే భరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, తుమ్మోజు రామ్మూర్తి, పాపినేని నాగేశ్వరరావు,పొట్లకాయల రమేష్,జడలనాగేశ్వరరావు, రజిని, కిలారి అప్పారావు, బానోత్ సీతారాములు, ధర్మసోత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యుద్ధం.

వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

నరేష్ ను అభినందించిన పొంగులేటి

– పుట్టినరోజునా దాతృత్వం చాటుకున్న కొలిశెట్టి

ఏన్కూరు, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : గ్రామీణ వైద్యుడు కొలిశెట్టి నరేష్ ను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. బుధవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో తన పుట్టినరోజు సందర్భంగా గ్రామీణ వైద్యుడు నరేష్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నరేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, స్వీట్లు తినిపించారు. మంత్రి సమక్షంలో ఏన్కూరు మండలంలోని కేసుపల్లి గ్రామానికి చెందిన బోజడ్ల కృష్ణ పక్షవాతంతో బాధపడుతుండగా రూ. 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా ఏన్కూరు మండల కేంద్రానికి చెందిన ఇనపనూరి నిఖిల్ కుమార్ మెదడులో రక్తం గడ్డ కట్టి కోమాలో నుండి కోలుకోగా అతనికి రూ.5 వేల రూపాయలను మంత్రి సమక్షంలో అందజేశారు. పుట్టినరోజునా కూడా ఆర్థిక సహాయం చేసి తనలోని దాతృత్వాన్ని చాటుకున్న నరేష్ ను మంత్రి పొంగులేటి అభినందించారు. కొన్నేళ్లుగా గ్రామీణ వైద్యుడిగా నిరుపేదలకు వైద్య, ఆర్థిక సహాయం, నిత్యవసరాల అందిస్తూ నరేష్ చేస్తున్న సేవలను మంత్రి కొనియాడారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

అప్పాయిగూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన డీపీవో రాంబాబు

కారేపల్లి, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : సింగరేణి మండల పరిధిలోని అప్పాయిగూడెంలో బుధవారం చలివేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు ప్రారంభించారు. వేసవీ తీవ్రత దృష్టిలో ఉంచుకోని ప్రజలు, బాటసారుల దాహర్తిని తీర్చటానికి చలివేంద్రం ఏర్పాటు చేయటం పట్ల సర్పంచ్ దండు ప్రవీణ్,కార్యదర్శి కృష్ణవేణి లను డీపీవో అభినందించారు.ఈ సందర్భంగా డీపీవో రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దటి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన ప్రజాప్రణాళిక 99 రోజుల కార్యాచరణ వేగవంతం చేయాలన్నారు.అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డీ.పుష్పలత,డీఈ నర్సింహారావు,ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్,జేఈ నరేంద్ర, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్‌కుమార్ ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పాఠశాలగా రామ నర్సయ్య నగర్ యూపీఎస్

కొణిజర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) కొణిజర్ల మండలం రామ నర్సయ్య నగర్ యూపీఎస్ పాఠశాల ఎవరీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంలో మండల ఉత్తమ పాఠశాలగా నిలిచింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా పాఠశాల హెడ్‌మాస్టర్ ఎస్.కే. ఖాదర్ ,సిబ్బంది స్వీకరించారు. విద్యార్థుల ఇంగ్లీష్ చదవు నైపుణ్యాల అభివృద్ధికి నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతిభ కనబరచడంతో ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆంగోత్ కిరణ్, ఏఏపీసీ చైర్మన్ స్వప్న పాఠశాల సిబ్బందిని అభినందించారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.

మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఇంటర్ విద్యార్థిని

చింతకాని, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : తెలంగాణ వ్యాప్తంగా వెలువడిన ఇంటర్ ఫలితాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో తిమ్మినేని గ్రామానికి చెందిన తుళ్ళూరి ఉమామహేశ్వరి 991 మార్కులు సాధించినందుకు గాను ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దరిశెట్టి చేతుల మీదుగా బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

ఆత్మీయ మిత్రుని కోల్పోవడం బాధాకరం: పాతర్లపాడు గ్రామ సర్పంచ్

చింతకాని, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : ఉంగుటూరు రమేష్ మరణ వార్త ఎంతో విచారకరమని పాతర్లపాడు గ్రామ సర్పంచ్ వి లక్ష్మి. అచ్చయ్య పేర్కొనన్నరు. సీపీఎం పార్టీ సభ్యుడిగా పాతర్లపాడు గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు ఎంతో గొప్పవి, మరువలేనివన్నారు. ఆయనలాంటి సేవాభావం కలిగిన వ్యక్తిని కోల్పోవడం గ్రామానికి తీరని లోటు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ,ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతినీ తెలియజేశారు

నంద్రు శాంతికి ఘన నివాళులర్పించిన యాక్టివ్ ప్రెస్ క్లబ్ సభ్యులు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 23 (మనం న్యూస్) : మండల పరిధిలో బనిగండ్లపాడు గ్రామానికి చెందిన. ప్రజా ప్రతిభ విలేకరి నంద్రు రత్న కిషోర్ సతీమణినంద్రు శాంతి అనారోగ్యం మృతికి యాక్టివ్ ప్రెస్ క్లబ్ సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. రిపోర్టర్స్ వేల్పుల మొహంతు బాబు (మీడియా టుడే). మేకల రమేష్ (నేటి తెలంగాణ) రాజవరపు శ్రీనివాసరావు(మనం), గ్రామ సర్పంచ్ బలుసుపాటి జయరాజ్ ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ నిస్సి హరిణి కూరపాటి ప్రభాకర్ మారాబత్తుల మోహనరావు రావు మోహన్ ఉప్పెల్లి రవి,రత్న కిషోర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు

మెగా డాన్స్ సమ్మర్ క్యాంప్ పోస్టర్ ను విడుదల చేసిన ఎస్ఐ

మధిర టౌన్, ఏప్రిల్22 (మనం న్యూస్) : మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డు నందు గల కే.వి.జి కాంప్లెక్స్ కొత్త ఎల్.ఐ.సి ఆఫీస్ బిల్డింగ్ నందు పవర్ యూత్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత కళ్యాణపు నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళా సాధన నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో మెగా డాన్స్ సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవ పోస్టర్,కరపత్రాలను బుధవారం మధిర టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ సాయిని నవిత చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులలో చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మక కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు,బాడీ ఫిట్ నెస్ కోసం ఈ సమ్మర్ డాన్స్ క్యాంపు ఉపయోగపడుతుందని కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాన్స్ అకాడమీ కూచిపూడి నృత్య గురువులు మహేశ్వరి,ఇంచార్జ్ సింధు పాల్గొన్నారు.

మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మధిర, ఏప్రిల్22 (మనం న్యూస్) : మధిర మండల పరిధిలో సిద్ధినేనిగూడెం సొసైటీ నందు మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షోరూమ్ శెట్టి కిషోర్ తో కలిసి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని ఎవరు కూడా దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఒకే కేంద్రం ఉండటం వల్ల రైతులకు కొనుగోలు చేయటం కాటాలు పెట్టడం ఇబ్బందిగా మారిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి తెలియజేయడంతో వెంటనే సిద్ధినేనిగూడెం సొసైటీకి మొక్కజొన్నల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మార్కెట్ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయించిన బట్టి విక్రమార్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా పక్క రాష్ట్రాల్లో పండే పంటలను ఎవరూ కూడా తీసుకురావద్దని కేవలం మండల పరిధిలో సిద్ధినేనిగూడెం సొసైటీ పరిధిలో పండిన పంటకు మొదట ప్రయారిటీ ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్,జిల్లా అధికార ప్రతినిధి కర్నాటీ రామారావు ,జిల్లా ప్రధాన కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు కిసాన్ సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వర రెడ్డి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ మదిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ సిద్ధినేనిగూడెం సర్పంచ్ వేల్పుల వెంకటరావమ్మ, సైదలిపురం సర్పంచ్ నెల్లూరు లక్ష్మి, నాగవరపాడు సర్పంచ్ ఈశ్వరమ్మ, నెల్లూరు కమలాకర్, తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి ,మాదాల రామారావు, చర్ల వెంకటరెడ్డి ,చల్ల లింగారెడ్డి, కటికల కృష్ణారెడ్డి, సూరంశెట్టి రమేష్, షేక్ జాన్ బాషా పాల్గొన్నారు.

హెచ్ఎం ఆర్వి సత్యనారాయణ ఉద్యోగ విరమణ

సౌమ్యులు, వృత్తి పట్ల అంకిత భావం నిబద్ధత కలిగిన వ్యక్తి సత్యనారాయణ : సర్పంచ్ బి అంజనబాబు

మధిర, ఏప్రిల్ 22 (మనం న్యూస్) మధిర మండలం యుపిఎస్ ఖమ్మంపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిశెట్టి వెంకట సత్యనారాయణ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా వారి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్ట అంజన బాబు మధిర మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ మురళీమోహన్ మాట్లాడుతూ ఆర్ వి సత్యనారాయణ గత 28 సంవత్సరములుగా తాను పనిచేసిన అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలుపుకొని పోయి పాఠశాలల అభివృద్ధికి కృషి చేసారని వృత్తి పట్ల నిబద్ధత అంకితభావం కలిగిన ఉపాధ్యాయులని ఎంతోమంది విద్యార్థులను ఉన్నతలగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఆర్వి సత్యనారాయణ దంపతులను కుటుంబ సభ్యులు, బందు మిత్రులు, ఉపాధ్యాయులు పూల మాలలు శాలువాలతో ఘనం గా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ వి సత్యనారాయణ కి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని వారి భావి జీవితం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో గడవాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎన్ కృష్ణమోహన్ , కెవిఎస్ చలపతిరావు, మధిర మండలం మాజీ విద్యాశాఖాధికారి వై ప్రభాకర్, పిఆర్టియు మధిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలె సుధాకర్, యుటిఎఫ్ మధిర మండల అధ్యక్షులు బి నాగరాజు , ఎస్ టి ఎఫ్ జిల్లా నాయకులు యరమల కోటా రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్, గ్రామ పెద్దలు మువ్వా వెంకయ్య బాబు, దొండపాటి సత్యనారాయణ, దిరిశాల రాము, ఉపాధ్యాయులు జిటి రామచంద్రారెడ్డి, ఎస్.కె మదార్, ఎండి జమీర్,వి లక్ష్మారెడ్డి , కె సునీత ,వి లక్ష్మి ప్రసన్న, అంగన్వాడీ టీచర్స్, సత్యనారాయణ వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు, పాల్గొన్నారు.

షేక్ జాన్‌బికి ముస్లిం ఐక్య సంఘం ఆర్థిక సహాయం

మధిర, ఏప్రిల్ 22 (మనం న్యూస్): ఆంధ్ర , తెలంగాణ సరిహద్దు ప్రాంతం మదుపల్లి బి తాళ్లూరు మధ్య కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ నెల 18వ తారీకు బోల్తా పడిన సంఘటనలో రెండు చేతులకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న షేక్. .జాన్ బి కు ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆర్థిక సహాయం ప్రకటించగా , బుధవారం ఈ మేరకు ఫ్రీలాన్స్ జర్నలిస్టు యం డి. షఫీ యు జమ, మధిరకు చెందిన విలేఖరి దోర్నాల వేణు తో కలసి , పదివేల రూపాయల నగదును అందజేశారు. ఆనాడు జరిగిన ప్రమాదంలో మధిర మున్సిపాలిటీ ఐదవ వార్డు మదుపల్లి నివాసి షేక్. జాన్ భీ ఈ ప్రమాదంలో తన రెండు చేతులు కోల్పోయింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉడగా వారికి వివాహాలు కాగా ఆమే భర్త మీరా సాహెబ్ కు కళ్ళు కనిపించవు. తన రెక్కల కష్టంతో ఆమే తన కుటుంబాన్ని పోషి స్తోంది. ప్రమాదంలో చేతులు కోల్పోవడంతో ఆమె కన్నీరు మున్నీరవుతుంది. తనను ఎవరు ఆదుకుంటారు ? భవిష్యత్తు ఎలా ఉంటుంది ? అనే విషాదం ఆమెను పట్టిపీడిస్తోంది. దాతలు ఎవరైనా ఆదుకుంటారా ? లేదా ? . ఇదిలా ఉండగా ప్రమాదానికి కారకులైన వారు ఎవరు కూడా తనను ఆదుకోలేదని , పరామర్శ చేయలేదని ఆమే విల పిస్తోంది. ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ ఇషాతి , రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్. హుస్సేన్ సాహెబ్ లు స్పందించి, ఆర్థిక సహాయం ప్రకటించగా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ యం డి. షఫీ యు జమ బాధితురాలు షేక్. జాన్ భీ కు 10 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మధిర కు చెందిన రిపోర్టర్ దోర్నాల వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో పోషణ పక్వాడ్ కార్యక్రమం..

అక్షరాభ్యాసాన్ని ప్రారంభించిన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు..

తల్లాడ, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : పోషక విలువలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తూ చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలు పునాదులుగా నిలుస్తున్నాయని తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తల్లాడ మేజర్ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ అంగన్వాడి సెంటర్ లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం సర్పంచ్ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పుట్టే పిల్లలకు జన్యుపరమైన సమస్యలు రాకుండా, భవిష్యత్తులో పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండేందుకు గర్భిణీ స్త్రీలకు అంగన్వాడి సెంటర్ల ద్వారా బలమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జీరో నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్లలో చేర్పించాలని తద్వారా తల్లిపాలుతో పాటు అంగన్వాడి సెంటర్ లో అందించే పోషక విలువలు ఉన్న ఆహారాన్ని పిల్లలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క తల్లిని అంగన్వాడి సెంటర్లో ఏ ఏ ఆహారం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను ప్రేమగా పలకరిస్తూ ముచ్చటించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయని సర్పంచ్ అడిగారు. అందుకు తల్లులు అంగన్వాడి బిల్డింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామని బిల్డింగ్ మంజూరయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. అంగన్వాడి బిల్డింగ్ కు అనువైన స్థలాన్ని ఎన్టీఆర్ కాలనీలోని పరిశీలిస్తున్నామని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని కొద్ది రోజుల్లోనే స్థల సమస్యను పరిష్కారం చేసుకొని బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 15 రోజులు జరగనున్న పోషణ పక్వాడ కార్యక్రమం గురించి ఏ సీ డీ పీ ఓ నవ్య శ్రీ, సూపర్వైజర్ రోజా అరుణకుమారి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, అంగన్వాడీ టీచర్ శైలజ, బాలింతలు గర్భిణీ స్త్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 22 మనం (న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించి, సమ్మెను నివారించడం ద్వారా ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా చూడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లిదండు ఆదినారాయణలి డిమాండ్ చేశారు. బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఐ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన 55 రోజుల సమ్మెలో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే గత్యంతరం లేక వారు సమ్మెకు దిగాల్సి వచ్చిందని విమర్శించారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని భద్రతతో కూడిన రవాణాగా అందిస్తున్న ఆర్టీసీ సంస్థ పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదని ఆయన హితవు పలికారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి తడికమల యోబు, టౌన్ కమిటీ సభ్యులు ఎర్రజల రాజశేఖర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి. తిరుపతయ్య, రామకృష్ణ, సతీష్, మల్లికార్జునరావు, వెంకటయ్య, నాగరాజు, సుధాకర్, రాంబాబు, 500 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు.

24న జరిగే మహాధర్నాని జయప్రదం చేయండి

బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు

వైరా, ఏప్రిల్ 22 (మనం న్యూస్): ఈ నెల 24న ఖమ్మం కలెక్టరేట్ ముందు నిర్వహించబోయే రైతుల మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు రైతులకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయటంలో విఫలం అయ్యిందని అన్నారు. ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులకు మొక్కజొన్న 26 క్వింటాలు నిబంధన ఎత్తివేసి పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేయాలని ,కౌలు రైతులకు ఓటిపి విధానాన్ని త్వరగా అమలు చేయాలని , కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని మొక్కజొన్న రైతులకు గన్ని సంచుల సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున జరగబోయే మహాధర్నాలో వైరా రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు . ఈ ప్రెస్ మీట్ లో మండల ,పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, అప్పం సురేష్ ,మాదినేని దుర్గాప్రసాద్ ,తిరుపతి శ్రీను, భూమాత కృష్ణమూర్తి, కామినేని శ్రీనివాసరావు మిషన్ భగీరథ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రవి, ఏదునూరు శ్రీను, వజినేపల్లి చక్రవర్తి,పాసంగలపాటి శివ, సింగవరపు నరేష్ ,వేముల శివకృష్ణ ,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి

సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం

కొణిజర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు.బుధవారం కొణిజర్ల మండలంలోని ఉప్పలచెలక, గద్దలగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కూలీలు నెలల తరబడి పనిచేసినా తమకు రావాల్సిన వేతనాలు ఇంకా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెల్లింపులు ఆలస్యమవుతుండడంతో జీవనోపాధి కష్టాలు పెరుగుతున్నాయని తెలిపారు. భూక్యా వీరభద్రం మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను పూర్తిస్థాయిలో అమలు చేసి, కూలీలకు హామీ ఇచ్చిన పనిదినాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తేజవత్ సీతారాములు, గద్దలగూడెం మాజీ సర్పంచ్ పుల్లూరి వెంకటేశ్వర్లు, రమేష్, వెంకట నారాయణ, నాగరాజు, రాములు, వెంకటేశ్వర్లు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

మనం
సత్తుపల్లి
సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నడపాలి.. బీజేపీ జిల్లా నేత ఆపతి రామారావు..

తల్లాడ, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : తల్లాడ మండలంలో వరి రైతుల సమస్యలు రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై వారాలు గడిచినా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకపో వడంతో రైతులు ఆగ్రహంతో తల్లాడ తహసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసనకు దిగారు. ఈ నిరసన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నాయకులు హాజరై రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఆపతి వెంకట రామారావు మాట్లాడుతూ రైతులను నట్టేట ముంచిన ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నడపాలి. లేనిపక్షంలో బీజేపీ కిసాన్ మోర్చా రైతుల తరఫున పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుంది" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజాప నాయకులు గాధె కృష్ణారావు, రాయల రమేష్, పెరిక కిరణ్ గౌడ్, చల్ల నరేష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్ మీద డ్రైనేజీ దాటి బయటకున్న నిర్మాణాలను తొలగించాలి

కల్లూరు టౌన్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : కల్లూరు మునిసిపాలిటీ లో ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ దాటి రోడ్డు మీదికి ఏర్పాటు చేసిన రేకుల షేడ్స్, తోపుడు బండ్లు, ప్రచార బోర్డ్ లను తొలగించి పాదాచారులకు నడవడానికి ఇబ్బంది కలగ కుండా చూడాలని దుకాణ యజములకు కల్లూరు టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ విజ్ఞప్తి చేశారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు 200 మంది షాప్ యజమానులకు ఈ విషయం నోటీస్ ఇవ్వటం ద్వారా తెలియ చేయటం జరిగింది. అందువల్ల నోటీస్ అందిన 7 రోజుల్లో స్వయంగా ఆక్రమణలను తొలగించుకొని ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ మేనేజర్ నాగేశ్వర్ రావు తెలిపారు. అలాగే ప్రకటనల బోర్డు లకు అనుమతి తీసుకోవాలని లేని యెడల మున్సిపాల్టీ సిబ్బంది చే వాటిని తొలగించి ఫైన్ వెయ్యటం తో పాటు మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకో బడతాయి అని తెలిపారు.

సత్తుపల్లిలో 14మంది ఆర్టీసీ కార్మికులు అరెస్ట్...

సత్తుపల్లి రూరల్, ఏప్రిల్ 22, (మనం న్యూస్) : సత్తుపల్లిలో ఆర్టీసీ సమ్మె ఉద్రిక్తంగా మారింది. కార్మికులు భోజనం చేస్తుండగా, డిపో మేనేజర్ పోలీసుల సహాయంతో బస్సును బయటకు తీయడంతో హైర్ బస్ యజమానులు, కార్మికులతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆర్టీసీ కార్మికులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో 14 మందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. తమను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ప్రశ్నించే గొంతుకను అణచివేయడం సరికాదని కార్మికులు ఆరోపించారు...

మనం
జనం లోనం అక్షర యజ్ఞం.
SCCL
కొత్తగూడెం
కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

నేటి నుంచి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

- హాజరుకానున్న డిల్లీ రైతు ఉద్యమ నేత ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలే
- రైతు పోరాట యోధుడు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సెమినార్లు
- రైతు సమస్యలపై విస్తృత చర్చ జరుపుతాం
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : కొత్తగూడెం లో ఏప్రిల్ 23, 24, 25 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభలకు రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించిన అతిరథ మహారథులు హాజరవుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు, బుధవారం నాడు మంచికంటిభవన్ లో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుసంఘం రాష్ట్ర మూడవ మహాసభల్లో డిల్లీ రైతు పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్, ఖమ్మం మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు, తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన భూమి హక్కులు, సాగునీరు,కనీస మద్దతు ధరలు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు,రుణ మాఫీ, రైతు భరోసా, పెండింగ్ లో ఉన్న అటవీ హక్కులు, త్రీ ఫేస్ విద్యుత్, దళారుల దోపిడీ పై మహాసభల్లో అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే ప్రతినిదులు చర్చించి భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తామని అన్నారు,ఈ సందర్భంగా పంటలు, ప్రణాళికలు అంశంపై జరిగే సెమినార్ లో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జానయ్య, రైతాంగ పోరాటాలు –ప్రభుత్వ విధానాలు అనే అంశంపై ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్ ప్రసంగిస్తారని తెలిపారు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది జలసూత్రం శివరాం ప్రసాద్ మాట్లాడుతూ రైతు మహాసభల జయప్రదం కోసం సహకరించిన కొత్తగూడెం ప్రజలకు, ప్రముఖులకు శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాసభలకు హాజరయ్యే ప్రతినిదులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్వాగతం– సుస్వాగతం పలుకుతుందన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, భూమి హక్కుల సాధనకు ఉద్యమాలను రూపొందిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్,డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు కున్సోత్ ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె తప్పదు

– గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 22(మనం న్యూస్) : ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ లు పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడెం శేషగిరిభవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. కారుణ్య ఉద్యోగాలపై ఏసీబీ విచారణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో మెడికల్ వ్యాలిడేషన్ కోసం ఎదురు చూస్తున్న కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని పెండింగ్ లో ఉంచిన మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు రూ.50 వేల కోట్లను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని చెల్లించకుండా కావాలని సింగరేణి సంస్థను నష్టాల్లోకి తీసుకెళ్లి సింగరేణి సంస్థను సర్వనాశనం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం కలిసి కొత్త గనులను ప్రారంభించకుండా సంస్థలో కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని మెడికల్ బోర్డు నిలిపివేశారని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. అదేవిధంగా క్రమం తప్పకుండా స్ట్రక్చర్ కమిటీను నిర్వహించి కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, వైవి రావు, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, సందబోయిన శ్రీనివాస్, గోపి, హుమాయూన్, నితిన్, గంగారం, మండల రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సోమయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలల ప్రస్తావన కేబినెట్ లో చర్చించండి

–ఇప్పటికే ప్రారంభమైన 'దోస్త్' ఆన్లైన్ ప్రక్రియ

– మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలనే ప్రస్తావనను గురువారం జరిగే రాష్ట్ర కేబినెట్ లో చర్చించాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ ద్వారా కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గల 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో గత యేడాది 8000 మంది, ఈ యేడాది 7753 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు, ఈ యేడాది ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో మైనారిటీ గరుకుల సంస్థ రెండో స్థానంలో నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో నేటి వరకు మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులకు స్వస్తి పలికి, ఉపాధి చూసుకుని జీవనం సాగిస్తున్నారని, బాలికలకు వివాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి ఒక్కో విద్యార్థికి ఒక లక్షా, ఇరవై వేలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో నేటి వరకూ ఒక్క మైనారిటీ గురుకుల డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదని దీని కారణంగా మైనారిటీ గురుకుల సంస్థ పై వెచ్చిస్తున్న నిధులు బూడిదలో పోసిన పన్నీరవుతుందని అన్నారు. యస్సీ, యస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 80 కు పైగా గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని, మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేదన్నారు. దీని కారణంగా మైనారిటీ గురుకులాలో ఇంటర్ వరకు చదివిన విద్యార్థులు ఉన్నత విద్యలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే డిగ్రీ ప్రవేశాల కొరకు ఆన్లైన్ ప్రక్రియ ప్రారంభమైందని కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బాల, బాలికల కొరకు వేర్వేరుగా ప్రాతీ జిల్లాలలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసేవిధంగా ముఖ్యమంత్రి ధ్రుష్టికి తీసుకెళ్లాలని కోరారు.

స్తంభించిన ఆర్టీసీ చక్రం..డిపోల వద్ద తీవ్ర ఉద్రిక్తత

- డిపో ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన కార్మిక సంఘాలు
- బస్సులను అడ్డుకున్న ఆందోళనకారులు.. పోలీసుల మోహరింపు
- వాగ్వివాదం..తోపులాటతో రణరంగమైన డిపో పరిసరాలు
- అక్రమ అరెస్టులతో సమ్మెను అణచివేయాలని చూడటం దుర్మార్గం
- ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతున్న నిరసనపై పోలీసుల ప్రతాపం అన్యాయం
- అరెస్టులు చేసినా వెనకడుగు వేయం
- కార్మిక ఐక్యతతోనే ప్రభుత్వ మెడలు వంచి డిమాండ్లు సాధించుకుంటాం
- ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేత కందుల భాస్కర్

కొత్తగూడెం టౌన్ ఏప్రిల్ 22 (మనం న్యూస్): కొత్తగూడెం: అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ చక్రం స్తంభించిందని, కార్మికుల న్యాయపోరాటంతో కొత్తగూడెం డిపో వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మె ప్రారంభం కాగా బుధవారం తెల్లవారుజామున కొత్తగూడెం డిపోకు చేరుకున్న ఆర్టీసీ ఉద్యోగులు, సంఘాలు, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య భారీ వాగ్వివాదం, తోపులాట జరిగింది. పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా అరెస్టు చేసి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, అరెస్టులు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యతతోనే విజయం సాధ్యమని, ప్రతి ఒక్కరూ సమ్మెకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన కార్యక్రమంలో సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, గెడ్డాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, లక్ష్మీనారాయణ, షాహీమ్, కైసర్, షమీమ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలున్నంతకాలం కమ్యూనిజం ఉంటుంది

చుంచుపల్లి, ఏప్రిల్ 22(మనం న్యూస్) : చుంచుపల్లి మండలంలోని వెంకటేశ్వర కాలనీ గ్రామపంచాయతీలో (కొమరం భీమ్ కాలనీ) సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యదర్శి జెండా ఆవిష్కరణ.పి వై ఎల్ మండల కార్యదర్శి, మోకల. ప్రసాద్ అధ్యక్షతన, పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఊ క్లా మాట్లాడుతూ సిపి ఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ పుట్టి ఇప్పటికి 57 సంవత్సరాలు కావస్తుంది. 19 69 లో కామ్రేడ్ చంద్ర.పుల్లారెడ్డి. పైలా.వాస్దేరావ్. సత్యనారాయణ సింగ్, రామ్ నరసయ్య, మరెందరో నాయకత్వంలో ఏర్పడిన గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమం,. శ్రీకాకుళోద్య మం, సిరిసిల్ల, జగిత్యాల ఉద్యమాలలో పేద ప్రజలందరినీ ఒక తాటి మీదికి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సందర్భంలో అనేకమంది రాజ్య హింసలో అశువులు బాశారు.ఈ పోరాటాల ఫలితంగా వన్ ఆఫ్ సెవెంటీ చట్టం ఐదు ఆరు షెడ్యూలు, పిసా చట్టం ముఖ్యంగా గిరిజనులకు తప్పని పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాల రూపంలో ప్రత్యేక హక్కులు కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడినది అయినా మన చట్టాలు పుస్తకాలకే పరిమితమై ఉన్నవి వాటిని పోరాడి అమలుపరచుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది.ముఖ్యంగా గోదావరి లోయ పరిహాక ప్రాంతంలో వ్యవసాయ సాగు భూమిలేని పేద గిరిజనులకు అండగా నిలబడటంకై దళాలను ఏర్పాటు చేసి దళాల నాయకత్వంలో లక్షల ఎకరాల పోడు భూములు నరుక్కోవడానికి సాగు చేసుకోవడానికి తోడ్పడడమే కాకుండా.

వాటిపై హక్కుల కొరకు అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా! అటవీ హక్కు పత్రాలు గిరిజనులకు గత ప్రభుత్వాలు ఇవ్వడానికి మన పోరాటాలే కారణం ఇంకా అటువిహక్కు పత్రాలు రాని మన పేద గిరిజనులు ఎందరో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలు గ్రూపులుగా చీలిపోవడం ప్రజలకు విప్లవ పార్టీ అభిమానులకు బాధాకరమే అయినప్పటికీ. ఆచరణ సిద్ధాంత

బేధాలను భారత ప్రజలు చైతన్యవంతులై పేద ప్రజలకు అండగా కమ్యూనిస్టు పార్టీలను ఒక తాటిపై తీసుకురావాల్సిన బాధ్యత భారత ప్రజలపైనే ఉంది.ఈ పరిస్థితిని అనుకోవుగా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా బిజెపి పాలకులు నక్సలైట్లను నిర్మూలించడమే కాకుండా. ప్రశ్నించిన ప్రతి పౌరుడిని రాజకీయ నాయకులను ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాను అర్బన్ నక్సలైట్లుగా టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించి ఉద్యమకారులని సంవత్సరాల తరబడి జైల్లో ఉంచడం మనం చూస్తూనే ఉన్నాం.

ప్రజల మధ్య తారతమ్య భేదాలు ఉన్నంతకాలం పేద ప్రజలు ఉన్నంతకాలం కమ్యూనిజం నిర్మూలించడం ఎవరి తరం కాదు, కమ్యూనిజం పోరాట రూపాన్ని మార్చుకుంటుంది అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాడుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్, ఏఐకేఎంఎస్, పి ఓ డబ్ల్యు నాయకులు రాంబాబు, కోరం వీరభద్రం, గణేష్, మోకల సునీత, భుక్య సాలి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ మహిళలకు చీరలు, గాజుల పంపిణీ

– చిన్నారులకు అక్షరాభ్యాసం

– పాల్గొన్న సర్పంచ్ వాంకుడోత్ వీరన్న

చుంచుపల్లి, ఏప్రిల్ 22(మనం న్యూస్) : చుంచుపల్లి తండాలో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ వాంకుడోత్ వీరన్న మరియు ఉప సర్పంచ్ భుక్య మౌనిక, అంగన్వాడి టీచర్ జానకి,జమున ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ మహిళలకు అవసరమైన చీరలు, గాజులు, పూలు మరియు ఇతర సామాగ్రిని పంపిణీ చేయడంతో పాటు చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాంకుడోత్ వీరన్న తన స్వంత నిధులతో గర్భిణీ మహిళలకు చీరలు, గాజులు అందించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పిస్తూ, సకాలంలో పోషకాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రభుత్వ పోషణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని గర్భిణీ స్త్రీలకు మరియు తల్లులకు పోషణపై సూచనలు అందించారు. గర్భిణీ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నపిల్లల పెంపకం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.అదేవిధంగా చిన్నారులకు

అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా విద్యాప్రాధాన్యతను తెలియజేశారు. చిన్నపిల్లలు చదువులో ముందుకు రావాలని, మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సర్పంచ్ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం చిన్నారుల్లో ఆనందాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అంగన్వాడీ టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామస్తులు సర్పంచ్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరారు.మొత్తం మీద ఈ కార్యక్రమం గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలకు మంచి ఉదాహరణగా నిలిచింది.

ఎండల మధ్య ఉపశమనం

– సుజాతనగర్‌లో చలివేంద్రం ప్రారంభించిన మేయర్ గణేష్

సుజాతనగర్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : కొత్తగూడెం నగరంలో పెరుగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు నగర పాలక సంస్థ మేయర్ గణేష్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ డివిజన్‌లో ఈరోజు చలివేంద్రం ప్రారంభించారు. ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం విశేషం. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ లింగం పుష్పావతి ముఖ్యంగా పాల్గొని, మేయర్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. సుజాతనగర్ ప్రాంతానికి చెందిన పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని మేయర్ గణేష్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని మేయర్ గణేష్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం,

సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తక్షణ ఉపశమనం లభించడమే కాకుండా, ప్రజాసేవలో మేయర్ గణేష్ కృషి మరోసారి స్పష్టమైంది.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.
SCCL
కొత్తగూడెం నియోజకవర్గం
కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి - సుజాతనగర్

ఉపాధి హామీ పనిముట్ల పంపిణీ

పాల్గొన్న సర్పంచ్ మాలోత్ బలరాం

చుంచుపల్లి, ఏప్రిల్ 22(మనం న్యూస్) : నంద తండా గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కల్పించవలసిన సౌకర్యాలు మరియు పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ మాలోత్ బలరాం, గ్రామ సెక్రటరీ భూమిక మరియు పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా కూలీలకు అవసరమైన పనిముట్లు పంపిణీ చేయడంతో పాటు, పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని, కూలీల సంక్షేమం తమకు ముఖ్యమని అన్నారు. సెక్రటరీ భూమిక కూడా కూలీలకు అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూలీలు, తమకు అవసరమైన పనిముట్లు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ చర్యల వల్ల పని సులభంగా మరియు సురక్షితంగా చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు

లక్ష్మీదేవిపల్లి ఏప్రిల్ 22 (మనంన్యూస్): జిల్లాలో ఈ నెల 20 వ తారీకు నుండి జరుగుతున్న సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి తెలిపారు. బుధవారం ఉదయం జరిగిన పది పరీక్షకు 352 మంది అభ్యర్థులు నమోదు కాగా 296 మంది హాజరై 56 మంది గైర్హాజర్ అయ్యారు. ఇంటర్ లో 792 మంది అభ్యర్థులు నమోదు కాగా 677 మంది హాజరై 115 మంది గైర్హాజర్ అయ్యారు. మధ్యాహ్నం పూట పదికి 25 మందికి గాను 23 మంది హాజరై ఇద్దరు గైర్హాజరు అయ్యారు, ఇంటర్ లో 198 మందికి 162 మంది హాజరై 36 మంది గైర్హాజర్ అయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఒక సెంటర్, ఎగ్జామ్స్ అసిస్టంట్ కమిషనర్ 6 సెంటర్లు ఫ్లయింగ్ స్క్వాడ్లు 10 సెంటర్లు సందర్శించారు. ఎటువంటి మాల్ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

సరస్వతిదేవి విగ్రహావిష్కరణ

లక్ష్మీదేవిపల్లి ఏప్రిల్ 22 (మనంన్యూస్):మండలంలోని మైలారం ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓరం రాజమొగిలి, నూనావత్ విజయ్ కుమార్, అతని స్నేహితులు రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులచే సరస్వతీ దేవి విగ్రహం ఆవిష్కరించడం జరిగింది. ప్రత్యేక చొరవతో సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైలారం పాఠశాల పూర్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మురళి , తేజావత్ లాలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత సాధ్యం : వక్తలు

– ఎస్ పి ఎల్ విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

పాల్వంచ, ఏప్రిల్ 22(మనం న్యూస్): క్రీడలతో మంచి దేహదారుఢ్యం తో పాటు మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని వక్తలు పేర్కొన్నారు. సంగం ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. సంగం ప్రీమియర్ లీగ్ (ఎస్ పి ఎల్) ఆర్గనైజర్స్ ఆహ్వానం మేరకు టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ..ఎస్ పి ఎల్ సీజన్ 4 క్రికెట్ టోర్నీ గ్రామీణ ప్రాంత క్రీడా స్ఫూర్తి కి నిదర్శనం అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొంటూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. మాదకద్రవ్యాలు విడనాడి క్రీడల పట్ల మక్కువ చూపాలని వివరించారు. మానసిక, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని తెలిపారు. ప్రతి ఆటలో క్రీడా కారులు నియమ నిబంధనల కనుగుణంగా ఆడాలని సూచించారు.

నగదు, ట్రోఫీలు అందజేత

క్రికెట్ లో గెలుపొందిన టీంలకు నగదు బహుమతి, ట్రోఫీలు అందించారు. సగం సర్పంచ్ బానోతు రవికుమార్, నాగారం

సర్పంచ్ ధారావత్ స్వప్న, నారాయణరావుపేట ఉపసర్పంచ్ ఎర్రపోతు సంతోష్, మోదుంపురపు గణేష్, కంటి నరేష్, పాకాల కార్తీక్, అడ్వకేట్ శోభారాణి, స్వాతి స్కూల్ చైర్మన్ నీలిమా చౌదరి, బృందావన్ రెస్టారెంట్, జై పార్క్ యజమాని జిల్, సింగరేణి రిటైర్డ్ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, జర్నలిస్టు శనగ రామచంద్ర రావు, టిఎన్ఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ టోర్నీలో లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంత్ నగర్ పంచాయతీ షఫాన్ టీం ప్రథమ బహుమతి (30వేలు), రెండవ నగదు బహుమతి (పదిహేను వేల రూపాయలు) సంగం గ్రామ పంచాయతీకి చెందిన సంగం టీం, మూడవ నగదు బహుమతి క్రింద ఏడు వేల ఐదు వందలు ఇరవెండికి చెందిన మోహన్ టీం కైవసం చేసుకుంది.

పాల్వంచలో పట్టపగలే చోరీ..

– ఒకరు అదుపులోకి.. కొన్ని వస్తువులు స్వాధీనం

పాల్వంచ, ఏప్రిల్ 22 (మనం న్యూస్): పట్టణ పరిధి వెంకటేశ్వర హిల్స్ కాలనీలో పట్టపగలే జరిగిన చోరీ ఘటన స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. వనమా కాలనికి చెందిన వ్యక్తులుగా అనుమానిస్తున్న దుండగులు ఇంటి తలుపులను గడ్డపలుగులతో పగులగొట్టి లోపలికి చొరబడి, బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న ఒక మొబైల్ ఫోన్, సిల్వర్ నాణెం, చిల్లర నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. అదనంగా గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్, బియ్యం, కోడిగుడ్లు, మిక్సీ వంటి

గృహోపకరణాలను కూడా దొంగిలించినట్లు వెల్లడించారు. విలువైన ఆభరణాలు సురక్షితంగా ఉండటంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై నాగరాజు పోలీసు సిబ్బందితో కలిసి, సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఒక అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. అతని వద్ద నుండి కొన్ని దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పార్టీల జెండాలతో అంబేద్కర్‌ను అవమానిస్తారా

– వెంటనే తొలగించాలని మేయర్ కు వినతి

కొత్తగూడెం టౌన్ ఏప్రిల్ 22 (మనం న్యూస్): కొత్తగూడెం పట్టణం పోస్ట్ ఆఫీస్ సెంటర్ సర్కిల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం చుట్టూ రాజకీయ పార్టీ జెండాలను ఏర్పాటు చేయడాన్ని దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు ,ఏర్పాటుచేసిన జెండాలను వెంటనే తొలగించాలని కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ కు దళిత సంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు, గత అనేక కాలంగా ఈ విధానం కొనసాగుతున్నదని అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించి సమస్త వ్యవస్థలకి తను రాసిన రాజ్యాంగం ద్వారా రక్షణ కల్పిస్తున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఏ రాజకీయ పార్టీ జెండాలు ఏర్పాటు చేయరాదని, అలా ఏర్పాటు చేస్తే ఆయనను అవమానించడమేనని, ఇప్పుడు ఏర్పాటు చేసిన వాటిని వెంటనే తొలగించాలని, రాబోవు కాలంలో కూడా ఏర్పాటు చేయకుండా కార్పొరేషన్ వారు ప్రత్యేక నిబంధనలు విధించాలని, వాటిని ఉల్లంఘిస్తే అధిక మొత్తంలో జరిమానా విధించే విధంగా చర్యలు చేపట్టాలని, అంబేద్కర్ విగ్రహం చుట్టూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు, సానుకూలంగా స్పందించిన మేయర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే నేను మేయర్ అయ్యానని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చదలవాడ సూరి, మహిళా సమైక్య నాయకురాలు కరీష రత్నకుమారి, మాదిగ ఐక్యవేదిక నాయకులు వేల్పుల భాస్కర్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మోదుగు జోగారావు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు, కార్పొరేటర్ సాగర్, దళిత సంగం జిల్లా నాయకులు చెనగా లక్ష్మణ్, మాదిగ యువజన

నాయకులు మొగిలి పాక మురళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం..
పాల్వంచ
పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

తెదేపా సీనియర్ నాయకులు యలమర్తి రవి మృతి

– రాజకీయాలకతీతంగా పలువురి సంతాపం

పాల్వంచ, ఏప్రిల్ 22(మనం న్యూస్): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యలమర్తి రవీంద్రబాబు (63) అనారోగ్యంతో మరణించారు. బుధవారం పాల్వంచ పట్టణ పరిధి సబ్ స్టేషన్ ఏరియాలోని రవి భౌతికకాయాన్ని పార్టీలకతీతంగా పలువురు సందర్శించారు. పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కోనేరు సత్యనారాయణ (చిన్ని) కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, మహీపతి రామలింగం, కోండం వెంకన్న గౌడ్, నూకల రంగారావు, పైడిపల్లి మహేష్, చింతా నాగరాజు, కాపర్తి వెంకటాచారి, కాంట్రాక్టర్స్ కాలనీ డిష్ ప్రసాద్, భట్టు సురేష్, తెదేపా నేతలు కనగాల అనంతరాములు, కాపా కృష్ణ మోహన్, వడ్లమూడి పూర్ణ, కళ్యాణం లక్ష్మిపతి, ఇటుకల శ్రీను, నిమ్మగడ్డ రమణ, కార్పొరేటర్ గుణ, కత్తి శ్రీను, ఎర్రపాటి కృష్ణ, రేగడి మధు, చంద్ర రవి, మైనేని బాబు, భువన చందర్ రెడ్డి, పార్టీలకతీతంగా నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వితరణ..

పాల్వంచ, ఏప్రిల్ 22(మనం న్యూస్): పట్టణ పరిధి బొల్లోరు గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, కేటీపీఎస్ అసిస్టెంట్ ఎకౌంట్స్ ఆఫీసర్ రాధ(దంపతులు) పాల్వంచ శాఖ గ్రంథాలయానికి బుధవారం వైఫై వితరణ చేశారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థుల ఆన్లైన్ తరగతులు కోసం 8వేల రూపాయలతో 14 నెలల వైఫై రీచార్జ్ చేశారు. ఈ సందర్భంగా మంచిగా చదివి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, సెక్రటరీ కరుణకుమారి దాతలకు సంస్థ తరుపున దన్యవాదాలు తెలుపుతూ.. వైఫై సేవలు కేవలం ఉద్యోగ ప్రిపరేషన్ కొరకు ఉపయోగించు కోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు (లైబ్రేరియన్) మధుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి జిమ్ ఎంతో ఉపయుక్తం : కూనంనేని

పాల్వంచ, ఏప్రిల్ 22(మనం న్యూస్): పాల్వంచలో ఫిట్‌నెస్ జిమ్ ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. వివాదాలకు ఆస్కారం లేకుండా జిమ్ నిర్వహణ సాగాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సిపిఐ పట్టణ కార్యదర్శి, 40వ డివిజన్ కార్పొరేటర్ ఆడుసుమిల్లి సాయిబాబా, 44వ డివిజన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వం, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, మహిపతి రామలింగం, డా యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు, నాయకులు, ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం : ఎమ్మెల్యే జారె

దమ్మపేట, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : దమ్మపేట మండలం గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి పదవీవిరమణ పొందుతున్న ప్రధానోపాధ్యా యులు మద్దిరెడ్డి రామకృష్ణారెడ్డి, (నవీ) మరియు తెలుగు ఉపాధ్యాయురాలు దగ్గుల సుజాత (ఫూా తెలుగు) సేవలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కొనియాడారు ఈ సందర్భంగా నిర్వహించిన పదవీవిరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుని విద్యారంగ అభివృ ద్ధికి వారు అందించిన సేవలు ఆదర్శప్రాయమని తెలిపారు విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత ముఖ్యమని తమ పదవీకాలంలో అనేక మంది విద్యార్థులను మంచి మార్గంలో నడిపించినందుకు ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు.అనంతరం పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి స్మారక చిహ్నాలను అందజేశారు మిగిలిన జీవితం ఆరోగ్యంతో ఆనందంతో గడపాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన జాతీయ రెజ్లర్ వెంకట ప్రసాద్‌ను పరామర్శించిన డీవైఎస్ఓ పరంధామ రెడ్డి

రామవరం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): గత నెల చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జరిగిన కేలో ఇండియా ట్రైబల్స్ జాతీయస్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్న జాతీయ క్రీడాకారుడు వెంకట ప్రసాద్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా కాలి మణికట్టు వద్ద గాయపడి శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను జిల్లా యువజన క్రీడా అధికారి (డీవైఎస్ఓ) శ్రీ పరంధామ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంకట ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వైద్య నివేదికలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, వెంకట ప్రసాద్ ప్రతిభావంతుడైన రెజ్లర్ అని, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రదర్శన కనబరిచి గుర్తింపు పొందిన క్రీడాకారుడని తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇస్తూ, వెంకట ప్రసాద్ త్వరగా కోలుకుని తిరిగి మైదానంలోకి వచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించి జిల్లా కీర్తిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇ.మొగిలి, సభ్యులు ఆదినారాయణ, జస్వంత్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిచయ కార్యక్రమం

చుంచుపల్లి,ఏప్రిల్ 22 (మనం న్యూస్) : ఈసీ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌరవనీయ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. ప్రేమలత గారి పరిచయ కార్యక్రమం బుధవారం లైబ్రరీ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కిరణ్ కుమార్ ముధలకర్ అధ్యక్షత వహించగా, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి గారిని పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అధ్యక్షులు మాట్లాడుతూ బెంచ్-బార్ సమన్వయం న్యాయవ్యవస్థలో కీలకమని పేర్కొన్నారు. న్యాయవాదులు మరియు న్యాయమూర్తుల మధ్య సమన్వయం ఉన్నప్పుడే న్యాయ వ్యవస్థ సజావుగా సాగుతుందని తెలిపారు. తన ప్రసంగంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత గారు వృత్తి నైతికత, కోర్టు క్రమశిక్షణపై దృష్టి సారించారు. బెంచ్ మరియు బార్ మధ్య పరస్పర గౌరవం ఎంతో అవసరమని, అదే న్యాయ పరిపాలనను బలపరుస్తుందని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షులు షేక్ సాజహాన్ పర్వీన్, కాటూరి సంజీవరావు, ప్రధాన కార్యదర్శి గడిపల్లి మహేష్, జాయింట్ కార్యదర్శి గడదాసు నాగరాజు, క్రీడా కార్యదర్శులు బానోత్ దేవదాస్, సకరాకంటి ఉమ, మల్లెల ఉషారాణి పాల్గొన్నారు.అలాగే సీనియర్ న్యాయవాదులు జివికె మనోహర్, గణేష్ బాబు, పలివేల సాంబశివరావు, నాగిరెడ్డి, పోసాని రాధాకృష్ణ, ఉదయ్ భాస్కర్, రమేష్ కుమార్ మక్కడ్, వేల్పుల సుధాకర్, కసాని రమేష్ తదితరులు, జూనియర్ మరియు మహిళా న్యాయవాదులు, బార్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మనం
అశ్వారావుపేట
అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టు పై ఎన్ని కుట్రలు చేసినా ధర్మమే గెలిచింది

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి

దమ్మపేట, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : అశ్వారావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట మండల కేంద్రంలో తన నివాసంలో సున్నం నాగ మణి,మాజీ జడ్పీటీసీ మాట్లా డుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని తెలియజేస్తున్నాను.కమిషన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బతీయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టిన హైకోర్టు.పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ చెల్లదని న్యాయస్థానం చెప్పింది.కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం అయిందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేశారు.మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి , రైతుల ప్రయోజనాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సున్నం నాగమణి డిమాండ్ చేశారు.

కల్వకుంట్ల కవితకు మద్దతు ప్రకటించిన పానుగంటి ప్రసాద్

దమ్మపేట, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : అచ్చుతాపురం గ్రామానికి చెందిన పానుగంటి ప్రసాద్,వారి కుమారుడు పానుగంటి లోకేష్,కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి కల్వకుంట్ల కవిత,ఏప్రిల్ 25,2026 ప్రారంభించబోయే నూతన రాజకీయ పార్టీలో అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోడెం వెంకట్,కంటే కేశవ గౌడ్,ఆధ్వర్యంలో కల్వకుంట్ల కవిత,సమక్షంలో చేరనున్నారు.ఈ విషయమై బుధవారం నాడు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాటి పోతురాజు, కుర్సం రాంబాబు, తదితరులు, పాల్గొన్నారు.

మహాకారుణ అహింసా సద్భావన ర్యాలీ

దమ్మపేట,ఏప్రిల్ 22 (మనం న్యూస్) : దమ్మపేట మండల కేంద్రంలో మందలపల్లి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ మూమెంట్ వారి ఆధ్వర్యంలో 7 రోజుల జ్ఞాన సప్తాహం లో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం చేయడం ద్వారా ప్రశాంతత, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లభిస్తుందని తద్వారా ఆత్మ జ్ఞానంతో పాటు ఆరోగ్యం లభిస్తుంది అని లబ్ది పొందిన సాధకులు తెలిపారు. జీవహింస వద్దు - శాఖాహారం ముద్దు, ఏ జీవిని చంపే హక్కు ఎవరికి లేదు, ప్రేమించు ప్రేమించు ప్రతీ జీవిని ప్రేమించు ప్లకార్డులు చేత పట్టుకొని, నినాదాలు చేసిన శాఖాహార ప్రియులు, మానవులంతా శాకాహారులు కావాలని ర్యాలీలో పాల్గొన్న వక్తలు కోరారు. ఈ కార్యక్రమంని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు వడ్లమూడి శ్రీనివాసరెడ్డి, శ్రీను, రజిని సప్తాహం మరియు ర్యాలీ లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం..

భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

రాష్ట్ర విద్యా సదస్సు గోడపత్రికల ఆవిష్కరణ

– టి పి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజు పిలుపు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర విద్యా సదస్సు గోడ పత్రికలను ఆర్లగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంఘం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భం గా టి పి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి రాజు మాట్లాడుతూ ఈ నెల 30 న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర విద్యా సదస్సును సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్లింగంపల్లి హైదరాబాద్ లో జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల విద్యాసంచాలకులు డాక్టర్ ఈ నవీన్ నిగోల ఐఏఎస్, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఎం కోదండరాం లు ప్రారంభ ఉపన్యాసకులుగా, ప్రొఫెసర్ జి హరగోపాల్ ముఖ్య వక్తగా ప్రొఫెసర్ చింతకింది కాసిం (ఆంధ్రజ్యోతి పూర్వ ఎడిటర్) కే శ్రీనివాస్ లు హాజరవుతున్నారని తెలిపారు. జాతీయ విద్యా విధానం సామాజిక న్యాయం, తెలంగాణలో అసమాన విద్య విద్యారంగ సంక్షోభం, పచ్చిమాసియా యుద్ధం ప్రపంచ రాజకీయాలు వంటి ముఖ్యమైన అంశాల గురించి విశ్లేషణ తో కూడిన ప్రసంగం ఇవ్వనున్నారని సదస్సు ప్రాధాన్యతను గుర్తించి టిపిటిఎఫ్ నాయకులు విద్యావంతులు టీచర్లు ఎక్కువ మంది హాజరై విషయాలను తెలుసు కున్నట్లయితే యువతను విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరిచి మంచి సమ సమాజాన్ని నిర్మించుకోవచ్చని అన్నారు. టీచర్లు విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యా సదస్సులు విజయవంతం చేయాలని కోరారు.జనగణన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డబ్బులు చెల్లించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని రాష్ట్రంలో కొన్ని జిల్లాలకు చెల్లించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీచర్లకు చెల్లించకపోవడం సరికాదని ఇప్పటికైనా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జరిగిన తప్పులకు అధికారుల సరైన వివరణ ఇవ్వవలసి వస్తుందని తెలిపారు . తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో పనిచేస్తున్న డ్రైవర్లు కండక్టర్లు ఇతర వాహనాల్లో పనిచేస్తున్న కార్మికులు ప్రజలను సురక్షితంగా వారి వారి గమ్యాలకు చేరవేయడంలో చాలా జాగ్రత్త అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ న్యాయంగా రాయవలసిన ఆర్థిక లావాదేవులన్నిటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ గోడ కరపత్రికలు ఆవిష్కరణలో మండల అధ్యక్షులు కోరసా వెంకటేశ్వర రావు ప్రధాన కార్యదర్శి బి రవి జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఏ రామ్ చందు, జిల్లా కౌన్సిలర్ పి లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు కే. సోమశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించండి : సిఐటియు డిమాండ్

భద్రాచలం ,ఏప్రిల్ 22 (మనం న్యూస్): భద్రాచలం ఆర్టిసి కార్మికుల సమస్య పరిష్కారం కోసం, సమ్మెలోకి దిగిన కార్మికులకు సిపిఎం సిఐటియు సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం బీ నర్సారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు వై వి రామారావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, జరుగుతున్నటువంటి ఈ సమ్మెకు సిపిఎం సీఐటీయూ సంపూర్ణ మత తెలియజేస్తుందని, గత ప్రభుత్వం హయాంలో జరిగిన సమ్మెలో అగ్రభాగాల నిలిచామని విజయం సాధించేంతవరకు పోరాటం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే పరిష్కారం చేయాలని, ప్రభుత్వంలో విలీనం ఇతర కార్మిక సమస్యలను పరిష్కరించాలని,కార్మికులను పెట్టి చాకిరి చేయించుకుంటూ వారికి రావలసిన రాయితీలను ప్రభుత్వం ఇవ్వట్లేదని, ఈ కాలంలో ఆర్టీసీ కార్మికుల పై వేధింపులు పెరిగాయని పని వారం పెరిగిందని, కొత్త ఉద్యోగాలు ఇస్తామని ఉద్యోగ భద్రత లేకుండా వ్యవహరిస్తుందని, ఆర్టీసీ కార్మికులు అనివార్యంగా సమ్మెకు వెళ్లే పరిస్థితి ప్రభుత్వం తీసుకు వచ్చిందని, వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే కార్మికుల పక్షాన సిపిఎం సిఐటియు నిలబడుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు ,ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు నాయకులు ఎం వి ఎస్ నారాయణ. ఎన్ నాగరాజు ఎస్ అజయ్ కుమార్, రాయల రాములుప్రతాప్, ప్రసాద్, బాలు, బి ఎన్ రావు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపినారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

– స్వయంగా కూలీల హాజరు వేసిన ఏపీడి
ప్రతి రెండు రోజులకు ఒకసారి
పని ప్రదేశాలను సందర్శించాలని ఆదేశాలు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): దుమ్ముగూడెం మండలంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఏపీ డి విజయ భాస్కర్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా పైడిగూడెం గ్రామంలో పని ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన అనంతరం పర్ణశాల గ్రామపంచాయతీ గోవిందపురం గ్రామంలో చెరువు పూడిక తీత పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తానే స్వయంగా పనికి వచ్చిన ఉపాధి హామీ కార్మికుల పేర్లను చదువుతూ హాజరు వేశారు. పని ప్రదేశం వద్ద కల్పిస్తున్న ఏర్పాట్ల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు రోజు అందిస్తున్నారా అని కార్మికులను అడగగా నీటి ఏర్పాట్లు చేయడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సాంకేతిక సహాయకుడు రోజు పని ప్రదేశం కి వచ్చి కొలతలు వేసి పని ఇస్తున్నారా అని మహిళలను అడగగా రావడంలేదని వారు సమాధానం చెప్పడంతో అక్కడే ఉన్న సాంకేతిక సహాయకుడు నాగరాజుని మందలించారు. ప్రతిరోజు పని ప్రదేశాలకు వచ్చి ఉపాధి హామీ కార్మికులకు కొలతలు వేసి కొలతలు ప్రకారంగా పని జరిగేలా చూసి వారికి వేసవికాలంలో నిర్దేశించిన కూలి అందేలా చూడాలని మరోసారి పని విషయంలో అశ్రద్ధ చేయవద్దని సున్నితంగా మందలించారు. అనంతరం సర్పంచ్ వాగే ఖాదర్ బాబు తో మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో కార్మికుల సంఖ్యను పెంచాలని రోజుకి 37 రూపాయల కూలీ చెల్లిస్తున్నందున ఈ పనిలో పాల్గొనే కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని, దీంతోపాటు గ్రామీణ ఉపాధి పథకం ద్వారా గ్రామాలలో సిసి రోడ్లు నిర్మించుకోవడానికి వీలు కలుగుతుందని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో రైతులకు ఉపయోగపడే పథకాలు ఏమైనా ఉంటే చెప్పాలని మాజీ ఎంపిటిసి తెల్లం భీమరాజు ఏపిడిని కోరారు. దీనికి స్పందనగా ఆయన మాట్లాడుతూ మేకలకు గొర్రెలకు, కోళ్లకు, పశువులకు షెడ్లు నిర్మించుకోవడానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు. దీంతోపాటు పామాయిల్ పంటలు, పండ్లను అందించే వివిధ రకాల పంటలను వేసుకోవడానికి పథకంలో అవకాశం ఉందని పంట వేసిన మూడు సంవత్సరముల వరకు మొక్క నాటిన నాటినుండి మొక్క బ్రతికి వృద్ధి చెందే వరకు మొక్క నిర్వహణక గాను పథకం ద్వారా కూలీలు చెల్లించే అవకాశం ఉందని వివరించారు. గతంలో చేసిన డబ్బులు పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జనవరి నెల వరకు జరిగిన పనులకు డబ్బులు చెల్లించడం జరిగిందని ఫిబ్రవరి నెల నుండి జరిగిన పనులకు మాత్రమే చెల్లించవలసి ఉందని ఈ పనులు కూడా నిధులు మంజూరు అయ్యాయని త్వరితిగతిన డబ్బులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్ రామ్, సర్పంచ్ వాగే. ఖాదర్ బాబు, ఉప సర్పంచ్ భాగే శ్రీధర్ ఏపీవో సుకన్య, ఈసీ రాజసింహ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సాంకేతిక సహాయకులు నాగరాజు వార్డు సభ్యులు సవలం భద్రయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చర్ల, దుమ్ముగూడెంకు 23 బోర్లు మంజూరు

– ఎంపీ వద్దిరాజు నిధుల కేటాయింపు

భద్రాచలం, ఏప్రిల్, 22 (మనం న్యూస్): ఏజెన్సీ ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని గిరిజన గూడెల్లో నీటి ఎద్దడి సమస్యకు బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరిష్కారం చూపారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అక్కడి గిరిజనులకు చేతిపంపుల ద్వారా మంచినీటిని అందజేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎంపీ రవిచంద్ర స్పందించి తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో రెండు మండలాల్లో 23 మంచినీటి బోర్లు మంజూరు చేశారు. వీటిలో దుమ్ముగూడెంలో 15, చర్లలో 8 బోర్లు ఉన్నాయి. ఈ మేరకు బోర్ల నిర్మాణానికి అయ్యే రూ.35 లక్షలు విడుదల చేశారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా సత్వరమే బోర్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. తాము అడిగిన వెంటనే బోర్లు మంజూరుతో పాటు నిధులు విడుదల చేసినందుకు ఎంపీ

వద్దిరాజు రవిచంద్ర కు భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు కృతజ్ఞతలు తెలిపారు.

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం : దిష్టిబొమ్మ దహనం

భద్రాచలం, ఏప్రిల్ 22 (మనం న్యూస్):
భద్రాచలం కూనవరం రోడ్డులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తమిళనాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని "ఉగ్రవాది"గా అభివర్ణించడం అత్యంత బాధాకరమని అన్నారు. దేశ ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ప్రధానమంత్రిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.అభివృద్ధి, జాతీయ భద్రత కోసం కృషి చేస్తున్న నాయకుడిని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ అసహనాన్ని, నిస్సహాయతను బయటపెడుతోందని అన్నారు. కాంగ్రెస్ వరుస ఓటములతో ఖర్గేకు మతి భ్రమించిందని తీవ్రంగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మారావు, పోడియం బాలరాజు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గుగులోతు బాలు నాయక్, పినపాక కన్వీనర్ పొన్నం బిక్షపతి, బూర్గంపాడు మండల ప్రెసిడెంట్ సాయి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చుక్కపల్లి బాలాజీ, అశ్వాపురం మండల ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు ఐలయ్య, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, ఆవుల సుబ్బారావు, ఏనుగుల వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంతువుల అరణ్యరోదన

నీటి కుంటలలో నీరేది ?
జంతువుల దాహం తీరేదెట్ల !
అడవులలో ఎండిపోయిన వాగులు, కుంటలు
మూలనపడ్డ నీటి కుంటల పథకం
నీటికోసం అల్లాడుతున్న మూగజీవాలు

చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మూగజీవాల ప్రాణాల మీదకు వచ్చింది. గత కొన్నేల్లుగా నిదులు లేమి కారణంగా మూగ జీవాల దాహార్తిని తీర్చే నీటి కుంటల పథకం నిలిచిపోయింది. ఎండలు మండుతున్న వేళ అడవులలోని జంతువులు త్రాగునీరు లేక అల్లాడుతున్నాయి. వర్షాకాలం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ నేటి వరకు ఒక్క చుక్క వర్షం కూడా కురియకపోవడంతో అడవులలోని చెరువులు, కుంటలు నీరు లేక ఎండిపోయాయి. దీంతో దాహం తీర్చుకునేందుకు చుక్కనీరు దొరకక మూగజీవాలు అల్లాడుతున్నాయి. నీటి కోసం సమీప గ్రామాలకు వచ్చిన సందర్భంలో వేటగాళ్ల వేటుకు బలవుతున్నాయి.

అడవులలోని జంతువుల త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2019 సంవత్సరంలో నీటి కుంటల నిర్మాణం చేపట్టింది. వేసవి కాలంలో అడవులలోని వాగులు, కుంటలు ఇంకిపోయి దాహం తీర్చుకునేందుకు జంతువులు జనావాసాల వద్దకువచ్చి వేటగాళ్ల చేతిలో మృత్యువాత పడుతున్నందున వాటికి అడవులలోనే నీటి కుంటల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు గాను అటవీశాఖ సిబ్బంచే జంతు గణన చేపట్టి అవి సంచరించే ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రాంతంలో చుక్కల దుప్పులు, సాంబార్, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు వంటి జంతువులు 1000 కి పైగా ఉంటాయని ఆశాఖ లెక్కలలో తేలింది. ఇవి కాకుండా అడవిపందులు, కుందేల్లు, నక్కల తదితర జంతువులు సైతం సంచరిస్తున్నట్లు గుర్తించారు. చర్ల అటవీరేంజ్ సుమారు 18 వేల హెక్టార్లు ఉంటుంది. దీనిని 22 బీట్ లుగా విభజించారు. పేరుకు 22 బీట్ లు ఉన్నా కేవలం 11 మంది బీట్ అదికారులే ఈ ప్రాంతాన్ని పర్యవేక్షించాల్సి ఉంటుంది. అడవి జంతువులు వేసవిలో త్రాగునీటి కొరకు జనావాసాలలోకి రాకుండా ఉండేందుకు గాను జంతువులు సంచరించే ప్రాంతాలను గుర్తించి సిమెంట్ తో తొట్లు, సిమెంట్ తూరలతో 50 కి పైగా నీటి కుంటలను నిర్మించారు. కుంటలను నిర్మించిన ప్రభుత్వం వాటిలో నీటిని నింపేందుకు నిదులు కేటాయించలేదు. దీంతో మొదట్లో సంబంధిత బీట్ అదికారులు తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్ లో డీజిల్ పోయించి గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి కుంటలలో నీరు నింపేవారు. అనంతరం అదికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిదులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. పంచాయతీల నిర్వహనే కష్టతరం కావడంతో పంచాయతీ ట్రాక్టర్లు, ట్యాంకర్లు మూలనపడ్డాయి. దీంతో గత మూడు సీజన్లుగా అటవీప్రాంతంలోని నీటి కుంటలలో నీరు నింపడం నిలిచిపోయింది. ఫలితంగా ఈ ఫదకం మూలనపడి జంతువులకు త్రాగునీరు దొరకక అల్లాడుతున్నాయి. సుదూర ప్రాంతం ప్రయాణించి లేదా జనావాల నడుమ గల చెరువుల వద్దకు వెల్లి దాహార్తి తీర్చుకుంటున్నాయి. జంతువుల రాకను గమనిస్తున్న వేటగాళ్ళు వాటిని వేటాడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికయినా నీటి కుంటలలో నీరు నింపేందుకు నిదులు విడుదల చేసి మూగజీవాలకు త్రాగునీటిని అందించి వేటగాళ్ల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

ఆర్టీసీ సమ్మెతో ప్రయాణికుల అవస్థలు

- వెలవెలబోయిన బస్టాండ్
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించిన ప్రయాణికులు

చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) :
ఆర్టీసి ఉద్యోగులు సమ్మెకు దిగడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు విఫలమవడంతో కార్మికులు బుధవారం నుండి అకస్మిక సమ్మెకు దిగారు. ఉదయం నుండి ఆర్టీసి బస్ సర్వీస్ లు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడ్డారు. విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో సమ్మె కారణంగా బస్ లు లేక బస్టాండ్ లో పడిగాపులు కాసారు. వివిద పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారు మండుటెండలో ఇబ్బందులు పడ్డారు. సమ్మె విషయం తెలియని కొంత మంది ప్రయాణికులు బస్టాండ్ లోనే బస్ ల కొరకు పడిగాపులు కాసారు. బస్ లు రావని తెలుసుకొని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీంతో మద్యాహ్నం నుండి బస్టాండ్ వెలవెలబోయింది. భద్రాచలం, వెంకటాపురం వైపు వెల్లే మ్యాజిక్ వాహనాలు, ఆటోలు ప్రయాణికులతో కిక్కిరిసినడిచాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్రీడే స్కూల్ నిర్వహణ

చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) :

చర్ల మండలం చిన్నమిడిసిలేరు 1, 2 అంగన్ వాడీ కేంద్రాలలో పోషన్ పహాడ్ కార్యక్రమంలో బాగంగా బుధవారం ప్రీడే స్కూల్ నిర్వహించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులు తమ ప్రతిభాపాఠవాలను ప్రదర్శించారు. ప్రతిభ కనపరిచిన చిన్నారులకు సర్పంచ్ శ్యామల సీత చేతుల మీదుగా బహుమతులను అందచేసారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ బందా స్వరూప రాణి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, విజయలక్ష్మి, వార్డు సభ్యురాలు శ్యామల రోజ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మనం
చర్ల
చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

- ప్రధానోపాధ్యాయుడు రవికుమార్

చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని చిన్నమిడిసిలేరు మండల పరిషత్ ప్రాదమిక పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ఎస్ ఎస్ ఎస్ రవికుమార్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసారు. బడిబాట కార్యక్రమంలో బాగంగా బుధవారం పాఠశాల విద్యార్థులతో గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలతో పాటు అర్హులయిన ఉపాద్యాయులు విద్యాబోదన చేస్తారని తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగిసినందున వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విదంగా ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాద్యాయులు రజని, చంద్రకళ, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

30న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : చర్ల మండలం సుబ్బంపేట గ్రామ సమీపంలోని ఎదిర గుట్టల వద్ద గోదావరి నదిని ఆనుకొని ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఈ నెల 30 వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి పూనెం సమ్మయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు స్వామివారి కళ్యాణం జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణం కనులారా తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని విజ్ఞప్తి చేసారు. కాగా ఇకపై ప్రతిఏటా కళ్యాణం అనంతరం జరిగే అన్నదాన కార్యక్రమం మొత్తం ఖర్చును శాశ్వతంగా తామే భరిస్తామని దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామంలోని చిన్న అరుణాచలం ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి ప్రకటించారు. స్వామివారి దాతృత్వంపై భక్తులు హర్షం వ్యక్తం చేసారు.

ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా

చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా కార్యక్రమం వైభవంగా సాగింది. హిందూ ధర్మాన్ని పరిరక్షి ంచే లక్యంతో ప్రతి మంగళ వారం రాత్రి మండలంలోని ఆలయాలు లేదా గృహాల వద్ద హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో బాగంగా చంలోని దొడ్డి సూరిబాబు - కల్పన దంపతుల నివాసం వద్ద 43 వ వారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామనామ, హనుమాన్ కీర్తనలతో సాగిన ఈ కార్యక్రమంలో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామివారి పట్ల భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.

మనం

ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

పొంగులేటికి పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేసిన ఇల్లందు ప్రెస్ క్లబ్



ఇల్లందు, ఏప్రిల్ 22 లో (మనం న్యూస్) : ఇల్లందులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశ కార్యక్రమంలో ఇల్లందు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల, కేటాయింపు, తో పాటు పలు సమస్యల తో కూడిన వినతి పత్రాన్ని మంత్రి పొంగులేటికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పందిస్తూ సమస్య పరిశీలనలో ఉంది, త్వరలో పరిష్కరించడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారని ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ప్రెస్ కమిటీ సెక్రటరీ తాడూరి శేఖర్,, గుగ్లోత్ రాజేష్,, 999 రవి, వీరన్న, రఫీ, చాంద్ పాషా, ఆవుల భాస్కర్, దాస్యం సురేందర్ బాబు, బత్తుల రాధాకృష్ణ, సిరికొండ ప్రసాదు, నందు, తదితరులు పాల్గొన్నారు.

- సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో ఘనంగా సిపిఐ ఎం.ఎల్ దినోత్సవం

లెనిన్ జయంతి సందర్భంగా ఇల్లందులో జెండా ఆవిష్కరణ

ఇల్లందు, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : ఇల్లందు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సిపిఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ భారత దేశ విముక్తికి మార్క్సిజం,లెనిన్ ఇజం, మావో ఆలోచన విధానాల వెలుగులో ప్రతిఘటన పోరాటాలే సరైన మార్గమనిసిపిఐ (ఎంఎల్) ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అన్నారు.కామ్రేడ్ లెనిన్ 146వ జయంతి, సిపిఐ(ఎంఎల్) 57 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా ఇల్లందు పట్టణంలో 21 పిట్ ఏరియా, సత్యనారాయణపురం, ఇంద్రనగర్, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం వద్ద ఎండి.రాసుద్దిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. భారత దేశ విముక్తి, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం,దోపిడీ, పీడన, అణిచివేత, కులాలు, మతాలు లేని నవ సమాజ నిర్మాణం కోసం మార్క్సిజం, లెనినిజం,మావో ఆలోచన విధానమే మార్గమని, కులాలు, మతాలు,వర్గవిభజనలు ఉన్నంతవరకు వర్గ పోరాటాలు ఉంటాయని ఆయన అన్నారు.1969లో రివిజనిస్టు పంథాను వ్యతిరేకిస్తూ సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందని ఆ వెలుగులో గోదావరి లోయ పరిహారక ప్రాంతంలో పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిందని,ఎందరో వీరులు అమరత్వం పొందారని ఆయన అన్నారు. ఆ బాటలోనే నేటికీ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పోరాడుతుందన్నారు. న్యూడెమోక్రసీ పార్టీ ప్రజల సహకారంతో అనేక ఉద్యమలకు నాయకత్వం వహించి విజయం సాధించింది అన్నారు.నేడు కేంద్రం లో మతోన్మాద బిజెపి ప్రభుత్వం కుల - మత భావజాలాన్ని రెచ్చగొడుతుందని, పచ్చగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టి ప్రశ్నించే గొంతుకలను,ఆదివాసులపై దాడులను కొనసాగిస్తుందన్నారు. మరోపక్క భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ మనుధర్మ శాస్త్రాన్ని తెరమీదకి తీసుకొస్తు దేవునిపేరుతో అన్నో అకృత్యాలకు పాల్పడుతుందని విమర్శించారు. దేశంలో అత్యధిక సంపాదన మోడీ తనకు అనుకూలంగా ఉన్న కొంతమందికి దోచిపెట్టే పనిలో ఉన్నారని,అలాగే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలని అమలు చేయడం లో విఫలం అయిందని అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ పీడిత వ్యవస్థను నిర్మూలించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ క్రమంలో దేశంలోని విప్లవశక్తులు ఐక్యమై పోరాడాల్సిన అవసరం ఉందని, దేశ విముక్తి జరగాలంటే ఈ విధాన మే సరైన మార్గమని,వారన్నారు.ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ, ఐఎఫ్టియు నాయకులు కొప్పుల శ్రీనివాస్, బొగ్గారపు రాజు,గూళ్ల సదయ్య, డి.మోహన్ రావు, వెంకట నరసయ్య , నూనేశ్వరరావు, మండల వీరయ్య,రసాలలింగం,పులిమామిడి శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు..

- ప్రజల శ్రేయస్సే లక్ష్యం
- ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలి.
- వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు
- ఇల్లందు పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

ఇల్లందు, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ, పీవో, రాహుల్, ప్రత్యేక అతిథులుగాపాల్గొన్నారు.పర్యటనలో భాగంగా బుధవారం మంత్రి ఇల్లందు 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి, గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్ కార్యాలయాన్ని ప్రారంభించి, చైర్‌పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇల్లందు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని పేర్కొన్నారు. ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, త్వరలో రెండు విడతల్లో నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం సంబంధం పెంచుకుంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచిఫలితాలుసాధ్యమవుతాయని తెలిపారు.ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అనుభవం లేదని భావించకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ , మంత్రి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 200 నుంచి 700 ఓట్ల మెజారిటీతోగెలుపొందారున్నారు. కొత్తగా వార్డు కౌన్సిలర్లు ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్, ఎంపీడీవో, ధన్సింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ పెండ్యాల రాజు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తుమ్మల చిలక గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వీడ్కోలు..

- తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం

టేకులపల్లి ఏప్రిల్ 22(మనం న్యూస్) :

టేకులపల్లి మండలం బతుతండా గ్రామపంచాయతీ లోని తుమ్మల చిలక గ్రామంలో ప్రాథమిక పాఠశాల లోని నాలుగో తరగతి విద్యార్థుని విద్యార్థులు గురుకులం ఎంట్రన్స్ పరీక్షలు రాసి పాసైనందున.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. పుల్ సింగ్ ఆధ్వర్యంలో వీడ్కోలు మరియు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బద్ధతండ గ్రామపంచాయతీ సర్పంచ్, బానోత్. నరేష్, ఉపసర్పంచ్, భూక్య. కాంతారావు ముఖ్య అతిథిగా టి జి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్. లక్ష్మణ్ నాయక్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ మాజీ సర్పంచ్ నాగయ్య గ్రామ పెద్దలు ఈసం చంటి మండల కన్వీనర్ ప్రసాద్ శంకర్ అతిథులుగా, మరియు సి అర్ పి బాదావత్. భాస్కర్ ఈ సమావేశంలో పాల్గొని.గురుకుల ఎంట్రన్స్ పరీక్షలు రాసిన పిల్లలకు రోజువారిక్లాసులతోపాటు అదనంగాక్లాసులు తీసుకొని ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాసిన పిల్లలందరూ ఉత్తీర్ణులు అయ్యే విధంగా కృషి చేసిన ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు కు తల్లిదండ్రులు అతిథులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.గురుకులం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మరియు ఐదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో పిల్లలు తల్లిదండ్రులు యువకులు గ్రామ పెద్దలు హాజరైనారు ఈ సమావేశం విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు సుభద్ర ప్రత్యేక కృషి చేశారని ప్రధానోపాధ్యాయులు కొనియాడినారు.

ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం, ఏప్రిల్ 22(మనం న్యూస్): మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలో మిడియం లక్ష్మి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని, బుధవారం గృహప్రవేశ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశ వేడుకలో పాల్గొని, కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో జీవించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిమ్మ జాన్సీ, అమ్మగారిపల్లి సర్పంచ్ ఇర్ప కవిత, ఉప సర్పంచ్ శీలం సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్స్ గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోలా శశికాంత్, వార్డు సభ్యులు మడకం కాసులమ్మ, మేకల కళావతి, సజ్జ రమేష్, జమలముడి రామారావు, కొర్స నాగేశ్వరావు, జిమ్మ జంపయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

ఉసా అనిల్, లంకమల్ల కొండలరావు, తహశీల్దార్ సూర్యప్రకాష్, ఎంపీడీఓ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

డిపోలకు పరిమితమైన బస్సులు

- ఇబ్బందులు పడ్డ ప్రజానీకం - న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి: కార్మిక సంఘాల డిమాండ్

సంపూర్ణ మద్దతు తెలిపిన సీపీఐ, సీపీఎం (సీఐటీయూ)

మణుగూరు, ఏప్రిల్ 22(మనం న్యూస్): ప్రాంతంలో రవాణా సేవలు డిపోలకే పరిమితమవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలకు, పట్టణాల మధ్య నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, దినసరి కూలీలు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు అందుబాటులో లేకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. వేతనాలు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితుల మెరుగుదల వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. సమస్యలు పరిష్కారం కానంతవరకు ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ పోరాటానికి సీపీఐ,సీపీఎం, (సీఐటీయూ) సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం అన్ని వర్గాలు ఐక్యంగా పోరాడాలని ఈ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రవాణా వ్యవస్థపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సేవలను పునరుద్ధరించడం అత్యవసరమని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

అశ్వాపురం, ఏప్రిల్ 22(మనం న్యూస్): మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి, గొందిగూడెం పంచాయతీ పరిధిలోని బండ్ల సత్యం గుంపులో పాఠశాలను ఏర్పాటు చేసి, వేలాదిమందిని విద్యావంతులుగా తీర్చిదిద్ది, అందరి ఆదరాభిమానాలు చూరగొని, నేడు(గురువారం) ఉద్యోగ విరమణ పొందబోతున్న సీనియర్ ఉపాధ్యాయుడు గుగులోత్ వీరస్వామిని ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుధవారం గొందిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో, వీరస్వామి నాటి, పెంచిన పెద్ద మర్రిచెట్టు నీడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొందిగూడెం కొత్తూరు సర్పంచ్ కోండ్రు అంజమ్మ, గొందిగూడెం

మాజీ సర్పంచులు కాకా రాములు, పాయం భద్రమ్మ, గ్రామ పెద్దలు కోండ్రు రామచంద్రయ్య, కంగాల ఇరమయ్య, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లోడిగ రామారావు, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం తాటి నాగేశ్వరరావు, భీమవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పాయం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం. రమేష్, కె. సారమ్మ, సరోజిని, కృష్ణకుమారి పాల్గొన్నారు.

రేగులగండి వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మణుగూరు, ఏప్రిల్ 22(మనం న్యూస్): మండలంలోని కూనవరం పంచాయతీలో ప్రమాదకరంగా మారిన రేగులగండి చెరువు వద్ద భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బుధవారం ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ. చూసేందుకు సుందరంగా కొండల మధ్య ప్రకృతిలో ఉన్న ఈ చెరువు లోతును ఊహించక కొందరు మద్యం మత్తులో దిగి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. గడిచిన ఎనిమిది నెలల్లో ఇద్దరు మృతి చెంది వారి కుటుంబాలకు తీరని ఆవేదనను మిగిల్చారన్నారు. ఇలా ఏ కుటుంబానికి జరగరాదనే ఉద్దేశ్యంతో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రమాదకరంగా ఉన్న చెరువు ముందు భాగంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మనం
మనం కోసం అక్షర యజ్ఞం..
మణుగూరు
మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం

ప్రగతి విద్యానికేతన్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

అశ్వాపురం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): మల్లెలమడుగు లోని ప్రగతి విద్యానికేతన్ లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ప్రిన్స్ పాల్ జి. ఈశ్వర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరెస్పాండెంట్ సానికొమ్ము చైతన్య ముఖ్య అతిథిగా హాజరై, ప్రగతి విద్యానికేతన్ ఫౌండర్ కీర్తిశేషులు సానికొమ్ము బ్రహ్మారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎస్. లక్ష్మి ప్రసన్న ప్రిన్సిపాల్ జి. ఈశ్వర్ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ,భవిష్యత్ లక్ష్యాల సాధనపై వారు వివరంగా మాట్లాడారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ నిర్వహించిన వివిధ కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా, వారి సృజనాత్మకతకు వేదిక కల్పించబడింది కరెస్పాండంట్ సానికొమ్ము చైతన్య , తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎఎస్పీకి దోసపాటి సన్మానం

అశ్వాపురం, ఏప్రిల్ 22(మనం న్యూస్): భద్రాచలం ఎ ఎస్పీగా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న విక్రాంత్ కుమార్ సింగ్, ఐపిఎస్ ను బుధవారం దోసపాటి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, భద్రాచలంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడి శాలువాతో సత్కరించి, జ్ఞాపిక ను అందజేశారు. రానున్న కాలంలో భద్రాద్రి జిల్లాకు ఎస్పీ గా రావాలని దోసపాటి ఆశాభావం వ్యక్తం చేశారు.

సామూహిక శ్రీమంతాలు అక్షరాభ్యాసాలు

- పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

- అంగన్వాడీల అభివృద్ధికి ఎంతగానో

కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే పాయం

మణుగూరు, ఏప్రిల్ 22(మనం న్యూస్): మణుగూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల సమితి సింగారం సర్కిల్ లో పోషణ అభియాన్ (పక్వాడ) కార్యక్రమం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి సింగారం సర్కిల్ పరిధిలోగల గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నపిల్లలకు సామూహిక అక్షర అభ్యాస కార్యక్రమాలను నిర్వహించడమైనది. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ లు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందని దానిని సకాలంలో గర్భిణీలకు అందివ్వాలని అంగన్వాడి టీచర్లకు సూచన చేయడమైనది. అలాగే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అంగన్వాడీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని త్వరలో మండలంలోని అన్ని అంగన్వాడీలకు నూతన బిల్డింగులను నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం వార్డు సభ్యులు కోలపిన్ని మానస, ఉకే కృష్ణవేణి, బిరుదురాజుల శ్రీదేవి, వాంకుడోత్ నాగేంద్రబాబు, అంగన్వాడీ టీచర్లు ఆయాలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనం

పినపాక

పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

బిఆర్ఎస్ నూతన కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

- హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు - కెసిఆర్ నిజాయితీకి మారుపేరు

మణుగూరు, ఏప్రిల్ 22(మనం న్యూస్): పినపాక నియోజకవర్గం మండల కేంద్రమైన మణుగూరు నందు భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీకి కొత్త ఊపు తీసుకొస్తూ నూతన కార్యాల యాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శుభారంభం చేశారు. పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, కార్యకర్తల భారీ సమక్షంలో జరిగిందికార్యాలయ ప్రారంభోత్సవానికి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రేగా కాంతారావు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ సిద్ధాం తాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యాలయం కీలక కేంద్రంగా మారుతుందని తెలిపారు. పార్టీ బలోపే తానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుప ్రనిచ్చారు.జిల్లాలో పార్టీ కార్యకలాపాలను సమన ్వయం చేయడం, ప్రజా సమస్యలను పరిష్కరించేం దుకు ఈ కార్యాలయం వేదికగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే రాబోయే రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, పార్టీని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని, పార్టీ పట్ల తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. నూతన కార్యాలయం ప్రారంభంతో జిల్లాలో బిఆర్ఎస్ కార్యకలాపాలకు మరింత వేగం చేకూరుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధాల రాజకీయాలకు గట్టి చెంపపెట్టు. రాజకీయ కక్షతో తెలంగాణ అభివృద్ధి చిహ్నాలపై బురదజల్లే ప్రయత్నాలు న్యాయస్థానం ముందు నిలవవని ఈ తీర్పు స్పష్టం చేసింది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, నిజానికి దక్కిన విజయంగా బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.ఈరోజు కాళేశ్వరం పై పెట్టిన కేసును కొట్టివేసిన సందర్భంగా మణుగూరు టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహంతో సంబరాలు జరుపుకున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను వదిలేసి ప్రతీకార రాజకీయాలు మానుకోవాలని, తెలంగాణ అభివృద్ధి పథంలో అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుంది అని తెలిపారు.

మొండికుంట గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ కు ఘన సన్మానం

అశ్వాపురం, ఏప్రిల్ 22(మనం న్యూస్): మండలంలోని మొండికుంట గ్రామపంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న పర్శిక భాస్కర్ ను గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఎక్కువ మంది కూలీలకు హాజరు పంపించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు డిపిఓ సుధీర్ , ఏపీడి రమణ, రాజారత్నం, అడిషనల్ పిడి రవి ఆధ్వర్యంలో సన్మానించారు. ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ గా ఎంపికై ఉన్నత అధికారుల ద్వారా సన్మానం పొందిన భాస్కర్ కు మొండికుంట గ్రామపంచాయతీ సర్పంచ్ మర్రి సంధ్య, పంచాయతీ కార్యదర్శి సంధ్య, పాలకవర్గ సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలో ఉన్న నిరుపేదలకు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పథకం ద్వారా పనులు, ఆదాయం కల్పిస్తూ, జిల్లాలో గ్రామపంచాయతీకి పేరు తెచ్చిన భాస్కర్ ను అభినందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, ఏపీవో, ఎంపీడీవోల సహకారంతోనే ఈ ఘనత సాధించానని అన్నారు.

టియుసిఐ 140వ మేడే పోస్టరావిష్కరణ

- దురాక్రమణ యుద్ధ బారాలకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమిద్దాం

- టి యు సి ఐ జిల్లా నాయకులు యనగంటి రమేష్

గుండాల,ఏప్రిల్ 22(మనం న్యూస్): గుండాల మండల పరిధిలో మామ కన్నుగ్రామపంచాయతీలో బాటన్న నగర్ కాచనపల్లి గ్రామాలలో 140 వ మేడే ని విజయవంతం చేయాలని యనగంటి గణేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు అనంతరం టి యు సి ఐ జిల్లా నాయకులు యనగంటి రమేష్ మాట్లాడుతూ చికాగో నగరన చిందిన రక్తం కాలువలై ప్రవహించే నగరవీధుల్లోన జండాలేరుపే క్కినాయి ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని పనికి తగిన ప్రతిఫలం ఇవ్వాలని పని స్థలాల్లో మెరుగైన పరిస్థితులు కావాలని పెట్టుబడిదారుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన రోజే మేడే 1886 సంవత్సరంలో మే ఒకటిన శ్రామిక వర్గ కార్మిక వర్గ పోరాట దినంగా పాటించాలని కార్మిక నాయకుల త్యాగంతో రక్త తరపనతో ఎరుపెక్కిన జెండానే సుత్తి కొడవలి జెండా కార్మిక జెండా ఆ పోరాట ఫలితమే.ప్రపంచ వ్యాప్తంగా నేడు ఎనిమిది గంటల పని దినం అమలవుతుంది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పని భారానికి పని గంటల పెంపుకి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి. భారతదేశంలో కూడా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో. పరిశ్రమల్లో. షాపింగ్ మాల్స్. స్విగ్గి జోమాటోలలో ఉద్యోగులకు ఇతర రంగాలలో పనిచేస్తున్న శ్రమజీవులకు 10 గంటల పని చేయించుకోవచ్చు సవరణ కేంద్ర ప్రభుత్వం చేసింది శ్రమ దోపిడిని తీవ్రం చేసింది వేతనాలు తగ్గింపు ఉద్యోగ భద్రత లేకపోవడం సామాజిక భద్రత ఏర్పడింది మేడే స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. అమెరికా సామ్రాజ్యవాద దేశం ఇజ్రాయెల్ తో జతకట్టి ఇరాన్ పై యుద్ధం చేస్తుంది. పశ్చిమాసియా దేశాలలో ని ఆయిల్ సంపదపై రిఫైనరీల పైన ఖనిజ వనరుల పైన.ఆధిపత్యం యుద్ధ తయారీ పరిశ్రమల లాభాల కోసం యుద్ధాన్ని చేపట్టి శ్రామిక పరిశ్రమల నాశనానికి విధ్వంసానికి కారణమైంది గజ లో చిన్న పిల్లల మరణాలకు మానవ వాహనానికి విధ్వంసానికి కారణమైన వివిధ దేశాలలో ఉన్నటువంటి కార్మికకర్షకుల జీవనోపాధిపైన ఆర్థిక ఒత్తిడికి గురయ్యే విధంగా ఈపాలకులువ్యవహరిస్తున్నారని ఈ దృశ్చర్యలకు వ్యతిరేకంగా ఈ పాలకుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం పనిచేయాలని సామ్రాజ్యవాదం పాలిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక శక్తులు మేడే కార్యక్రమంలో పాల్గొని కార్మికుల ఐక్యతను చాటుకోవాలని మన హక్కులు సాధించుకోవడం కోసం అహర్నిశలు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపి ఐఎంఎల్ మాస్ లైన్(ప్రజాపంద) మండల నాయకులు యనగంటి గణేష్ బాబు,గ్రామ నాయకులు మడకం లాలయ్య,కల్తి వెంకటేశ్వర్లు, పాయం కాంతయ్య ,రాకేష్, గ్రామస్తులు ఆటికం దుర్గారావు, రంగు నాగరాజు, బట్టు రాంబాబు,వెంకన్న,బట్టు ప్రవీణ్,మీడియం సంతు,యదలపల్లి చిన్న ముత్యాలు,మడకం లాలయ్య, జ్యోతి, అయితీ,మడకం జోగి,మీడియం మోటో, మడే శ్రీను, పాయం భీమయ్య, ఏక రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చండి

- ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో మణుగూరు జిఎం కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

- ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేత

మణుగూరు, ఏప్రిల్ 22(మనం న్యూస్): ఎండలు మండిపోతున్నాయి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చండి మహాప్రభో అంటూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఏరియా జిఎం కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు ధర్నా అనంతరం ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని సామెతగా మణుగూరు ఏరియా సింగరేణి కాంటాక్ట్ కార్మికుల పరిస్థితి ఉందన్నారు,అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి ప్రతి సంవత్సరం వేసవికాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కొన్ని రోజులపాటు ఐ ఎఫ్ టి యు విజ్ఞప్తి మేరకు అను ఉత్పాదక రంగంలో ఎండలో నిలబడి పని చేసే పారిశుద్ధ్య ఉద్యానవన రోడ్స్ క్లీనింగ్ లాంటి విభాగాలకు ఉదయాన్నే పనులు ప్రారంభించి మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే సమయానికి పనులు ముగించే విధంగా వెసులుబాటు కల్పించే వారిని ఈ సంవత్సరం అన్ని చోట్ల ఇదే విధానం గత వారం రోజులుగా ఎండ తీవ్రత దృష్ట్యా ఆ ప్రాంతాలలో అమలు అవుతోందని ఏరియా జిఎంకి వినతి పత్రం అందజేశామని వారు కూడా సానుకూలంగా స్పందించారని కానీ సంబంధిత అధికారులు టైమింగ్స్ గురించి మాట్లాడితే టైం పాస్ చేస్తూ చిత్రంగా సంబంధిత కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకుంటేనే పదివేల మార్పు అమలు ఆలోచిస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ప్రతి విషయాన్ని భూతద్దంలో చూడటం పట్ల ఆయన ఆక్షేపించారు, వేసవికాలంలో ఇతర ప్రాంతాల ఎండలు కన్నా కోల్ బెల్ట్ ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆ ఎండల్లో రోడ్లపై పనిచేయడం అనేది ఇబ్బందితో కోరుకున్నదని గమనించాలని కోరారు మానవతా దృక్పథంతో మణుగూరు ఏరియా కు ఉన్న ప్రత్యేకత యాజమాన్యానికి కార్మిక సంఘాలకు ఉన్న సత్సంబంధాల రీత్యా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలో మార్పు చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో సింగరేణి కాంగ్రెస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు కుంటా రవి, కె వీర్రాజు, సమ్మయ్య, కే గురుమూర్తి, కురం నాగేశ్వరరావు, వెంకటనారాయణ,భావు సింగ్,ఎస్.కె రజబ్ అలీ, రంగయ్య, నరసింహారావు,కమల, ఉపేంద్ర, నానమ్మ, నందిని, స్వాతి, రమణ, మంగ, కుమారి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అశ్వాపురం, ఏప్రిల్ 22(మనం న్యూస్): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన బుధవారం సాయంత్రం గోపాలపురంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథల మేరకు మల్లెలమడుగు గ్రామానికి చెందిన గాదెనబోయిన మహేష్ మొండికుంట నుండి మణుగూరు తన మోటార్ సైకిల్ పై వెళ్తుండగా, గోపాలపురం వద్ద మణుగూరు నుండి మొండికుంట వైపు వస్తున్న ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో మహేష్ కు కుడి చేయి విరిగి, బలమైన గాయాలు తగలగా వెంటనే 108 ద్వారా మణుగూరు 100 పడకల హాస్పిటల్ కి తరలించారు. అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తరలించనున్నట్లు సమాచారం. మహేష్ మణుగూరు డిపోలో ఆర్టీసీకి అద్దెకు నడపబడుతున్న బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు.

అక్రమ ఇసుక రవాణా ముఠా గుట్టురట్టు: ఒకరు అరెస్ట్, టిప్పర్ స్వాధీనం

సత్తుపల్లి, ఏప్రిల్ 22 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణలోకి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ముఠాను సత్తుపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసుల నిఘా నుండి తప్పించుకునేందుకు కారుతో పైలటింగ్ చేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నిందితులపై కేసు నమోదు చేశారు. ఏసీపీ కల్లూరుకి అందిన ముందస్తు సమాచారం మేరకు, సత్తుపల్లి ఎస్.హెచ్.ఓ ఆదేశాల ప్రకారం ఎస్.ఐ లిజి. అశోక్ కుమార్‌లి తమ సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం మేడిసెట్టివారిపాలెం క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు పోలీసులకు దొరకకుండా క్రెటా కారు (లిటీ ఎస్ -05-ఈ కె -9339లి) ను పైలట్ వాహనంగా వాడుతూ పోలీసుల కదలికలను గమనిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని కోవ్వూరు గోదావరి ర్యాంప్ నుండి ఇసుకను లోడ్ చేసి, ఏపీ పరిధిలోని సీతానగరం వరకు మాత్రమే అనుమతి పత్రాలు తీసుకుంటారు. అక్కడ నుండి తెలంగాణ సరిహద్దు దాటించేందుకు క్రెటా కారులో ముందుగా వెళ్తూ, పోలీసు తనిఖీలు లేవని నిర్ధారించుకున్నాక టిప్పర్ లారీని లోపలికి అనుమతిస్తారు. పోలీసు తనిఖీల్లో భాగంగా కారును ఆపగా, అందులో ఉన్న లిగద్దల శివలి (బేతుపల్లి) పట్టుబడగా, కారు నడుపుతున్న లిగద్దల శ్రీనులి పరారయ్యాడు. నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అక్రమ ఇసుకతో ఉన్న టిప్పర్ లారీ (లిఏ పి -39-టీ యు -7377లి) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గద్దల శివను అదుపులోకి తీసుకుని, టిప్పర్ డ్రైవర్ కువ్వారపు నాగేంద్రబాబు, పరారీలో ఉన్న గద్దల శ్రీనుపై ఎస్.ఐ లిపి. ప్రదీప్‌లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ సంపదను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా ఎండీ జిందా

- శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావుకు కృతజ్ఞతలు

భద్రాచలం, ఏప్రిల్ 22(మనం న్యూస్): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించిన తాజా జిల్లా కమిటీలో భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు ఎండీ జిందా ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించడం జరిగింది. ఆయనకు ఈ పదవి దక్కడం పట్ల కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జిందా నియామకాన్ని పురస్కరించుకొని భద్రాచలం యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం జిందాను కలసిన కార్యకర్తలు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ జిందా ఎప్పటినుంచో పార్టీ కోసం కష్టపడుతున్న నాయకుడని, అతని సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం సముచిత స్థానం ఇచ్చిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎండీ జిందా మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ ఉన్నత నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద వసతులు కల్పించాలి

-సిపిఐ నాయకులు పగడాల మల్లేష్

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): డబులెబెడ్రూం ఇండ్ల వద్ద వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని అల్లిపురం వద్ద -గల డబుల్బెడ్రూం ఇండ్లను పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో 14, 15 డివిజన్ల సిపిఐ నాయకులు సందర్శించారు. అక్కడ గృహవాసులతో -మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ కొత్తగూడెం, అల్లిపురం రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన వారికి, నగరంలోని వివిధ ప్రాంతాల వారికి అల్లిపురం డబుల్ బెడ్రూంల వద్ద ఇండ్లు కేటాయించారని తెలిపారు. ఇండ్లు కేటాయించినప్పటికీ అక్కడ కనీస మౌలిక వసతులు కల్పించలేదని తెలిపారు. విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల విద్యుత్ శాఖాధికారులు కరెంట్ కట్ చేశారని మరల కరెంట్ -సరఫరా పునరుద్ధరించారన్నారు. డబుల్బెడ్రూం ఇండ్ల వద్ద ప్రత్యేకంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందించాలని -డిమాండ్ చేశారు. త్రాగునీరు లేక అక్కడ గృహవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగ్గా లేదన్నారు. డబులెబెడ్రూంల వద్ద రాత్రి పూట వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర -ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు మౌలిక వసతులను తక్షణమే ఏర్పాటు చేయాలని లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావూరి సోందయ్య, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, మాకనబోయిన నాగేశ్వరరావు, రాపోలు కొండలు, ప్రతానపు ప్రసాద్, డబులెబెడ్రూం వాసులు -వీరబాబు, భూమా వెంకటి, వట్టికొండ లక్ష్మి, జంగాల బాబు, టి. నాగేశ్వరరావు, షేక్ సహీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఎవరీ చైల్డ్ రైడ్స్ ప్రోగ్రాంలో జంగా గుర్నాథ్ రెడ్డికి బెస్ట్ స్కూల్ అవార్డు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 23 (మనం న్యూస్) : మండలం లోని బనిగండ్లపాడు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపికై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదగా బనిగండ్లపాడు బీసీ కాలనీ ప్రధానోపాధ్యాయులు జంగా గురునాథరెడ్డి ఉపాధ్యాయులు చిన్నప్ప, సాంబయ్య,శివ అవార్డును అందుకున్న సందర్భంలో వారికి గ్రామం పెద్దల తరఫున గ్రామ ప్రజల తరఫున వారికి ప్రత్యేక అభినందనలు

సి.ఈ.పి ఉత్తమ పాఠశాలగా పమ్మి ఎంపిక

ఉపాధ్యాయులకు గ్రామ పంచాయతీ ఘన సన్మానం

ముదిగొండ ఏప్రిల్ 22 (మనం న్యూస్) : ముదిగొండ మండల పరిధిలోని పమ్మి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రతిభ చాటింది. సీఈపీ ప్రోగ్రాంలో భాగంగా ప్రకటించిన ఉత్తమ పాఠశాలల జాబితాలో పమ్మి పాఠశాల స్థానం సంపాదించుకోవడం పట్ల గ్రామ పాలక వర్గం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. గర్వకారణంగా ఉంది -- సర్పంచ్ వడ్డే మాధవరావు: ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డే మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ, ఉత్తమ పాఠశాలల జాబితాలో మన ఊరి బడి నిలవడం గర్వకారణమని కొనియాడారు.ఉపాధ్యాయుల నిరంతర కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.ఈ అభినందన కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంజాల రాజేష్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధిక, వార్డు మెంబర్లు ఏలూరి రజని, అన్నెగాని నాగమణి, బుగ్గవీటి జగదీశ్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు ఏలూరి హనుమంతరావు,గ్రామ ఉప అధ్యక్షులు రాయబారపు మహేష్,తదితరులు పాల్గొని ఉపాధ్యాయుల సేవలను అభినందించారు.సన్మానం పొందిన వారిలో ఉపాధ్యాయులు సురేష్, రమణ రెడ్డి, షర్మిల, నాగలక్ష్మి మరియు పాఠశాల సిబ్బంది ఉన్నారు. ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.లి

మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 23 (మనం న్యూస్) : మండల పరిధిలో అయ్యవారిగూడెం సొసైటీ నందు మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాన్ని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ప్రారంభించారు ఈ సందర్భంగా రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని ఎవరు కూడా దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో ఒకే కేంద్రం ఉండటం వల్ల రైతులకు కొనుగోలు చేయటం కాటాలు పెట్టడం ఇబ్బందిగా మారిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి తెలుపగా వెంటనే అయ్యవారిగూడెం సొసైటీకి మొక్కజొన్నల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మార్కెట్ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయించిన భట్టి విక్రమార్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు అదేవిధంగా పక్క రాష్ట్రాల్లో పండే పంటలను ఎవరూ కూడా తీసుకురావద్దని కేవలం మండల పరిధిలో అయ్యవారిగూడెం సొసైటీ పరిధిలో పండిన పంటకు మొదట ప్రయారిటీ ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు

ప్రభుత్వ ఏకపక్ష వైఖరికి హైకోర్టు బ్రేక్..

సంబరాలు చేసుకున్న బిఆర్ఎస్ నాయకులు.

ధర్మమే గెలిచింది

పీసీ ఘోష్ కమిష్ప స్టే పట్ల తాతా మధుసూదన్ హర్షం

– జిల్లా కార్యాలయంలో పండుగ వాతావరణం

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః పీసీ ఘోష్ కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ దాఖలైన పిటిషన్లపై నేడు హైకోర్టు స్టే విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పుతో కమిషన్ నివేదిక ఆధారంగా క్రిమినల్ చర్యలు లేదా తదుపరి విచారణ చేపట్టాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ ఎదుట పార్టీ శ్రేణులు బాణాసంచా కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. న్యాయమే గెలిచిందని హర్షం వ్యక్తం చేస్తూ, నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుల సంద్ర వెంకట వీరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్, మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, టౌన్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు తాజుద్దీన్, జిల్లా సీనియర్ నాయకులు ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, గొట్టిముక్కల శ్రీనివాస్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, వెంకట్, మాటేటి కిరణ్, మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రతిభతో మెరిసిన టీజీఎంఆర్జేసీ ఖమ్మం గర్ల్స్-1 విద్యార్థినులు

– మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభినందనలు

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః ఖమ్మం రాపర్తి నగర్లోని తెలంగాణ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల (గర్ల్స్-1) విద్యార్థినులు ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి కళాశాలకు గౌరవాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవిన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం నందు విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించి, వారి కృషిని ప్రశంసించారు. ఎంపీసీ విభాగంలో షేక్ రఫీక, రూప 466/470 మార్కులు సాధించి ప్రతిభను చాటుకోగా, ఫర్జీన్ ఫిర్దాస్ 985/1000 మార్కులు సాధించి విశిష్ట స్థానం పొందింది. బైపీసీలో అఫ్రోజ్ సనా 435/440 మార్కులు సాధించి ప్రతిభను నిరూపించగా, కుసుమ 974/1000 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించింది. తమ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరంలో 155 విద్యార్థినులకు గాను 123 మంది ఏ గ్రేడులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ చుండు అఖిల తెలిపారు. గతంలో మంత్రివర్యులు కళాశాలకు డిజిటల్ మానిటర్లు ఇవ్వడం వలన ఉత్తమ ఫలితాలకు తోడ్పడిందని అలాగే విద్యార్థినుల కృషి, అధ్యాపకుల నిబద్ధత,జిల్లా మైనారిటీ అధికారులు డిఎండబ్ల్యూఓ ఎమ్.డి.ముజాహిద్, ఆర్ఎల్సీ అరుణ కుమారి ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థినులు ఇలాగే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన అందరు విద్యార్థినులకు ,జిల్లా అధికారులకు, కళాశాల ప్రిన్సిపల్, సిబ్బందికి మంత్రివర్యులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీ సమ్మెకు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికల రామకృష్ణ తెలిపారు బుధవారం స్థానిక గిరిప్రసాద్భవన్లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు వారు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం. సమ్మె చేస్తున్నారని కానీ రాష్ట్ర ప్రభుత్వం దానిని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించింది తప్ప సమస్య పరిష్కారానికి కృషి చేయలేదని ఆయన విమర్శించారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు దారి తీసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కార్మికులను భయభ్రాంతులకు గురి చేసే పరిస్థితులను ప్రభుత్వం సృష్టిస్తుందని. కార్మికుల ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా ఆగ్రహానికి గురుకాక తప్పదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, మనోజ్, ఆకాష్ , జిల్లా నాయకులు గోపి చైతన్య పవన్ నరేందర్ ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు...

ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు : మంత్రి పొంగులేటి

–ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదని, ఈ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిందో వారు సమాధానం చెప్పాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూనే.. కొత్తగా ఆరు గ్యారంటీల హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

–గడప వద్దకే సంక్షేమం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను నేరుగా పేదల గడప వద్దకే చేరుస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలతో ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తోందని చెప్పారు.

–రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు

ఇళ్ల నిర్మాణ విషయంలో గత ప్రభుత్వం పేదలకు కేవలం అబద్ధపు హామీలే ఇచ్చిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

– విద్య, వైద్యానికి అత్యున్నత ప్రాధాన్యం

ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు తగిన సమాధానం చెప్పారని, ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ , ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయచందర్ , ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీపై వ్యాఖ్యలకు బిజెపి నిరసన

– ఖర్గే దిష్టిబొమ్మ దహనం..

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ దుమారాన్ని రేపాయి. ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో, స్థానిక 1 టౌన్ అధ్యక్షులు నరేష్ గాడిల అధ్యక్షతన నగరంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద బీజేపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, మల్లికార్జున ఖర్గేకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధానిపై నోటిదురుసుగా ప్రవర్తించడం కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు.ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, మల్లికార్జున ఖర్గే తన స్థాయిని మర్చిపోయి తెలివి తక్కువ ప్రేలాపనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిపై ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఆయన విమర్శించారు. రాజకీయం అనేది ఎప్పుడూ గౌరవప్రదంగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రధాని మోడీపై దేశ ప్రజలు చూపిస్తున్న అపరిమితమైన అభిమానాన్ని చూసి తట్టుకోలేక, ఆ అక్కసుతోనే కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ఖర్గే తన వ్యాఖ్యలకు గాను వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఖమ్మం జిల్లా శాఖ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెంకట్ గొంగుర, రుద్ర ప్రదీప్, జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా, రవి రాథోడ్, జిల్లా నాయకులు బోయినపల్లి సురేష్, మందడపు సుబ్బారావు, మేకల నాగేందర్, మార్తి ప్రసాద్, బోయినపల్లి శేఖర్, పొట్టిమూతి జనార్దన్, పిల్లలమర్రి వెంకట్, డీకొండ శ్యామ్, మేడ సంపత్, అనగాని రామారావు, అర్బన్ అధ్యక్షులు వాకదాని రామకృష్ణ, మండల స్థాయి నాయకులు పాలేపు రాము, పొట్టిమూతి వాణి, తుమ్మ ఇందు, ఊరుకొండ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మెతో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్రం

సత్తుపల్లి, ఏప్రిల్ 22, (మనం న్యూస్): తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం మరింత ఉధృతంగా కొనసాగింది. సమ్మె ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణా వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. బస్సులు డిపోల నుంచే బయటకు రాకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు చేరుకోవడంలో కష్టాలు పడ్డారు. అత్యవసర పనుల కోసం బయలుదేరిన వారు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఆటోలు, క్యాబ్ల ధరలు ఒక్కసారిగా పెరగడంతో ప్రయాణికులపై అదనపు భారం పడింది.సమ్మెను ఎదుర్కొనేందుకు అధికారులు ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లను నియమించి పోలీసుల పహారాలో కొన్ని బస్సులను నడిపించే ప్రయత్నం చేశారు. అయితే ఆర్టీసీ కార్మికులు ఈ చర్యలను అడ్డుకున్నారు. బస్సుల ముందే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఒక్క బస్సు కూడా కదలదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు జోక్యం చేసుకుని పలువురు కార్మికులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.కార్మికులు తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు కాలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.సమ్మెకు పలు కార్మిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం వెంటనే చర్చలకు రావాలని వారు డిమాండ్ చేశారు.ఇకపోతే, సమ్మె కొనసాగితే ప్రజలకు ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రతిపక్ష పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు.